



అక్రమాలకు సహకారం!

సూపర్ బజార్‌లో తప్పులపై తప్పులు చేస్తున్నా గుర్తించని వైనం

- రూ.కోట్ల దుర్వినియోగమైనా గుడ్డిగా ఆడిటింగ్
- విచారణాధికారిగా డీసీఏఓనే నియామకం
- ఇలాగైతే తప్పులు బయటపడతాయా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని సహకార శాఖ పనితీరు ఘోరంగా ఉంది. సూపర్ బజార్ వంటి సహకార సంస్థలు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తుంటే గుర్తించాల్సిన ఆడిట్ విభాగం గుడ్డిగా సంతకాలు చేసి పడేస్తోంది. ఆడిట్ విభాగానికి బాధ్యత వహించే జిల్లా అధికారినే సూపర్ బజార్ గోల్‌మాల్ వ్యవహారంపై విచారణాధికారిగా నియమించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగైతే వాస్తవాలు వెలుగులోకి వస్తాయా?... అనేది ఉన్నతాధికారులే చెప్పాలి.

విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజార్) చాలా కాలంగా ఆరోపణలు ఎదుర్కొంటోంది. కీలకమైన భూమిని సుహానీ షాపింగ్ మాల్‌కు లీజుకు ఇచ్చిన దగ్గర నుంచి అంతా అడ్డగోలుగానే నడిచింది. సంస్థ లీజు పత్రాలను బ్యాంకులో కుదవ పెట్టి సుహానీ యాజమాన్యం రూ.300 కోట్లకు పైగా అప్పులు చేసేసింది. వాటిని తీర్చలేక దివాలా తీస్తే ఆ మొత్తం మీరే కట్టాలంటూ సూపర్ బజార్‌కు నోటీసులు అందాయి. ఈ విషయం చాలాకాలం క్రితమే జరిగినా ఇటీవల వరకు వెలుగులోకి రాలేదు. అలాగే గత నాలుగేళ్లుగా ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ రకరకాల ఖర్చుల పేరుతో లక్షలాది రూపాయలు ఏటా డ్రా చేసుకుంటున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అందులో వివరాలు కూడా పొందుపరచారు.

ఆడిట్ అధికారులు ఏమి చేస్తున్నట్టు?

జిల్లాలో సహకార శాఖకు ప్రత్యేకంగా జిల్లా సహకార ఆడిట్ అధికారి (డీసీఏఓ) ఉన్నారు. డీసీఏవో కింద దాదాపు 70 మంది ఆడిటర్లు పనిచేస్తున్నారు. విశాఖ జిల్లాలోని సహకార సంఘాల లెక్కలన్నీ ఏటా ఆడిట్ చేసి, తప్పులుంటే వాటిని నివేదించాల్సిన బాధ్యత ఆడిటర్లది. వారి పనితీరు, నివేదికలను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సింది డీసీఏఓ. ఇంత పెద్ద ఆడిట్ విభాగం ఉండగా సూపర్ బజార్‌లో జరుగుతున్న తప్పుడు వ్యవహారాలను ... మిగతా 6వ పేజీలో

వైసీపీకి ఆరుగురు కార్పొరేటర్లు గుడ్‌బై

ఐదుగురు టీడీపీలో, మరొకరు జనసేనలో చేరిక

- నేడు మరో ఆరుగురు వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఐదుగురు టీడీపీలో, మరొకరు జనసేనలో చేరారు. వైసీపీకి చెందిన 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సునీత, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రువాణిలు గురువారం అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ జనసేనలో చేరారు. దీంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలం 60కి పెరిగింది. శుక్రవారం మరో ఆరుగురు ... మిగతా 6వ పేజీలో


అమరావతిలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు

రేషన్ మాఫియా

ఒక్క గాజువాక ప్రాంతంలోనే 500 టన్నుల బియ్యం పక్కదారి

కార్డుదారుల నుంచి కిలో రూ.12-15కి కొనుగోలు

- సబ్బవరం, చోడవరం, ఆనందపురం మండలాల్లో గల మిల్లులకు రూ.25కి విక్రయం
- ప్రాంతాల వారీగా వాటాలు వేసుకున్న నలుగురు వ్యాపారులు
- ఇద్దరు కార్పొరేటర్లతోపాటు మరొక నేత అండదండలు
- నెలనెల మామూళ్లు
- బియ్యం రవాణా చేసే మార్గంలోని పోలీస్ స్టేషన్లకు రూ.50 వేలు
- కళ్లముందు నుంచి రేషన్ బియ్యం తరలిపోతున్నా పట్టించుకోని వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతోంది. పేదలకు ఉచితంగా పంపిణీ చేసే బియ్యాన్ని దళారులు కిలో రూ.12కి కొనుగోలుచేసి మిల్లర్లకు రూ.25కి విక్రయిస్తున్నారు. ఒక్క గాజువాక నుంచే నెలకు 500 టన్నుల వరకు రేషన్ బియ్యం మిల్లులకు తరలిపోతున్నట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో కొందరు కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నేతలతోపాటు పోలీసులకు మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 5.29 లక్షల బియ్యం కార్డులు ఉండగా, ప్రభుత్వం ఎనిమిది వేల టన్నులు సరఫరా చేస్తోంది. అయితే ఆ బియ్యాన్ని అతికొద్దిమంది మాత్రమే తింటున్నారు. మిగిలిన వారంతా కేజీ రూ.12 నుంచి రూ.15కి విక్రయించుకుంటున్నారు. ఆ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న వారంతా తమతో అవగాహన కుదుర్చుకున్న మిల్లర్లకు కిలో రూ.25కి విక్రయిస్తున్నారు. మంచి లాభం వస్తుండడంతో రేషన్ బియ్యం కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయించేవారు పెరిగిపోతున్నారు. దళారులంతా ఒక్కో ప్రాంతాన్ని పంచుకుని ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి మిల్లర్లకు తరలిస్తున్నారు. గాజువాక పరిసర ప్రాంతాల్లో అయితే రేషన్ బియ్యం మాఫియా మరింత వేళ్లూనుకుపోయింది. గతంలో గుట్కా వ్యాపారం చేసిన వ్యక్తితోపాటు మరో ముగ్గురు గాజువాక, పెదగంట్యాడ, మల్కాపురం, సింధియా ప్రాంతాలను వాటాలుగా పంచుకుని రేషన్ బియ్యం మాఫియాను నడుపుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ ఆయా పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, స్థానిక నేతలు కొందరు విలేకరుల సమావేశాలు పెట్టి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. పౌర సరఫరాల శాఖ అధికారులతోపాటు పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారు. దీంతో నేతలను ఆ నలుగురు వ్యాపారులు కలిసి ప్రసన్నం చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. జనసేన పార్టీకి చెందిన ... మిగతా 6వ పేజీలో


రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్ ఫోటో)



29న జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

- సభ్యులకు సమాచారం అందజేసిన సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ 2025-26 బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 29న నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.4,554.27 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ముసాయిదా బడ్జెట్ రూపొందించిన విషయం తెలిసిందే. దానిని స్టాండింగ్ కమిటీ ఈ ఏడాది జనవరిలోనే ఆమోదించింది. అనంతరం కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించాల్సి ఉండగా, అదే సమయంలో కమిషనర్ బదిలీ అయ్యింది. ఆ తర్వాత ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆలోగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ ఉండగా బడ్జెట్ సమావేశానికి వీల్లేకపోవడంతో అధికారులు మిన్నకుండిపోయారు. ఈనెల ఐదో తేదీ నుంచి ఎన్నికల కోడ్‌ను ఎత్తివేయడంతో బడ్జెట్ సమావేశం ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించారు. కానీ శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో ఎమ్మెల్యేలంతా అమరావతిలో ఉండిపోయారు. దీంతో బడ్జెట్ సమావేశం నిర్వహణకు అవకాశం లేకుండాపోయింది. మరో పది రోజుల్లో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్నది. అప్పటిలోగా బడ్జెట్ ఆమోదం పొందకపోతే జీవీఎంసీ సాధారణ కార్యకలాపాలకు కూడా ఇబ్బంది తలెత్తుతుంది. ఇదే విషయం ... మిగతా 6వ పేజీలో

ఈకేవైసీకి డెడ్‌లైన్

బియ్యం కార్డుల్లో పేరు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 31లోగా రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ప్రక్రియ పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ సూచన

- జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు... సభ్యులు 15.91 లక్షల మంది
- 14.35 లక్షల మంది సభ్యుల ఈకేవైసీ పూర్తి...
- 1.64 లక్షల మంది పెండింగ్
- రేషన్ డీలర్లు, సచివాలయాలకు జాబితాలు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

బియ్యం కార్డుల్లో పేర్లు కలిగినవారంతా ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్... ఇది వినియోగదారుడు/కస్టమర్ గుర్తింపును డిజిటల్ పద్ధతిలో ధ్రువీకరించుకునే ప్రక్రియ) చేయించుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనను అమలు చేసేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పథకాలు తీసుకునే ప్రతి ఒక్కరూ తమ వేలిముద్ర (బయోమెట్రిక్) వేయడం ద్వారా ఈకేవైసీని పూర్తిచేసుకోవాలని సూచిస్తోంది. ఆ బాధ్యతను క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్, గ్రామ/వార్డు సచివాలయాలకు అప్పగించింది.



జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు ఉండగా, 15.91 లక్షల మంది సభ్యులు (యూనిట్లు) ఉన్నారు. గత ఏడాది గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 14.35 లక్షల మంది సభ్యుల ఈకేవైసీ పూర్తిచేశారు. మిగిలిన వారి ఈకేవైసీ కూడా పూర్తిచేయాలని పౌర సరఫరాల శాఖ ఆదేశించింది. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న సభ్యుల వివరాలు రేషన్ డిపోకు, సచివాలయాలకు పంపించింది. అయితే ఈకేవైసీ పూర్తిచేయని సభ్యుల వివరాలు ఇచ్చిన పౌర సరఫరాల శాఖ వారి ఫోన్ నంబర్లు జాబితాలో పొందుపర్చలేదు. దీనిపై డీలర్లు పలు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయడం సాధ్యమే కానీ నగరాలు, మునిసిపాలిటీలలో కష్టమని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఎండీయూ వ్యవస్థ ఏర్పాటు తరువాత డీలర్‌లకు, కార్డుదారుడికి మధ్య సంబంధం తెగిపోయింది. ఇంకా చెప్పాలంటే పోర్టబిలిటీ సదుపాయం రావడంతో డీలర్, ప్రాంతంతో సంబంధం లేకుండా ఎక్కడైనా సరకులు తీసుకునే వెసులుబాటు వచ్చింది. అందువల్ల బియ్యం కార్డుదారుల్లో కొందరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారడం జరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఫోన్ నంబర్ లేకుండా ఈకేవైసీ పూర్తిచేయడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. డీలర్లు, సచివాలయాలతోపాటు ఎండీయూ వాహనాల ద్వారా వీధుల్లో ప్రచారం చేయడం, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక ప్రాంతంలో వాహనం ఉంచి అక్కడకు ఈకేవైసీకి రావాలని చెబితే కొంతవరకూ పూర్తి చేయవచ్చునని డీలర్లు అంటున్నారు. మంగళవారంతో బియ్యం పంపిణీ పూర్తయిందని, నెలాఖరు వరకు ఎండీయూ ... మిగతా 6వ పేజీలో

టీచర్ల సీనియారిటీ జాబితాలో మళ్లీ తప్పులు

- గతంలో తెలిపిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోని డీఈవో కార్యాలయ సిబ్బంది
- 24 వరకు వినతుల స్వీకరణ

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపకల్పనలో విద్యా శాఖ మళ్లీ తప్పటడుగులు వేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీనియారిటీ జాబితాపై గత వారం ఇచ్చిన అభ్యంతరాలను విద్యా శాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో పరిశీలించకుండా పక్కనపడేశారని టీచర్లు ఆరోపిస్తున్నారు. గతంలో ఇచ్చిన సీనియారిటీ జాబితానే స్వల్పంగా సవరించి గురువారం మరోసారి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. గతంలో మెరిట్ కమ్ రోస్టర్ జాబితా ఇచ్చిన అధికారులు ఇప్పుడు మెరిట్ జాబితా పేరిట మరో లిస్టు అందుబాటులోకి తీసుకువచ్చారు. గత వారం టీచర్ల నుంచి సుమారు 150 వరకు అభ్యంతరాలు వచ్చాయి. ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి దాని ప్రకారం సీనియారిటీ జాబితాలో మార్పులు చేయాల్సి ఉన్నప్పటికీ విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియారిటీ జాబితాకు సంబంధించి మొత్తం వివరాలు ఒక ఉద్యోగి గుప్పిట్లోనే ఉన్నాయని, అతని నిర్ణయానుసారమే టీచర్ల నుంచి వచ్చి అభ్యంతరాలను పక్కనపెట్టేశారనే వాదన వినిపిస్తోంది. తప్పులు సవరించకుండా ఎన్ని పర్యాయాలు జాబితాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినా ఫలితం ఉండదని ఉపాధ్యాయ ... మిగతా 6వ పేజీలో

మధురవాడలో

రెండో సబ్ రిజిస్ట్రార్ పోస్టు రద్దు?

- పెదగంట్యాడ నుంచి గతంలో డిప్యుటేషన్‌పై నియమించిన రోహన్‌కుమార్‌ను వెనక్కి పంపాలని ఉన్నతాధికారుల నిర్ణయం
- రియల్ ఎస్టేట్ లావాదేవీలు తగ్గడమే కారణం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టును రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, సూపర్ బజార్ ప్రాంగణంలోని కార్యాలయానికి మాత్రమే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు (జాయింట్-1 జాయింట్-2) ఉన్నారు. అక్కడ లావాదేవీలు అధికంగా ఉండడం, ఆదాయం ఎక్కువ కావడంతో ఇద్దరు అధికారులతో నడుపుతున్నారు. దీని తరువాత ఎక్కువ ఆదాయం వచ్చే కార్యాలయం మధురవాడే కావడం, అక్కడ కూడా లావాదేవీలు ఎక్కువగా ఉన్నాయనే కారణంతో గత ఏడాది జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టును తాత్కాలికంగా సృష్టించారు. సూపర్ బజార్ కార్యాలయం నుంచి నెలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల ఆదాయం వస్తుండగా, అదేస్థాయిలో మధురవాడలో వస్తున్నదని, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉంటే పనులు వేగంగా జరుగుతాయని ఆ నిర్ణయం తీసుకున్నారు. పెదగంట్యాడలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ ... మిగతా 6వ పేజీలో



రాజీవ్ స్వగృహ భూమి డీ నోటిపై

22-ఏ నుంచి తొలగింపు

- ప్లాట్లు కొన్నవారికి త్వరలోనే రిజిస్ట్రేషన్లు
- మిగిలిన ప్లాట్ల వేలానికి సన్నాహాలు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండాడలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన భూమిని ప్రభుత్వం డీ నోటిపై చేసింది. ప్రభుత్వ భూముల జాబితా 22-ఏ నుంచి తప్పించింది. దాంతో అక్కడ ప్లాట్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్లు చేయడానికి మార్గం సుగమమైంది. మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు కట్టాలని 2009లో రాష్ట్ర ప్రభుత్వం ఎండాడలోని సర్వే నంబరు 16లో 57.16 ఎకరాలను రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు కేటాయించింది. కానీ ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. మధ్యలోనే ఆగిపోయింది. ఆ భూమి ఖాళీగా ఉండిపోయింది. అందులో కొంత తిరుమల తిరుపతి దేవస్థానానికి కేటాయించారు. అన్నీ పోగా 47.62 ఎకరాలు మిగిలింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ భూమిని 78 ప్లాట్లుగా విభజించి 2024 ... మిగతా 6వ పేజీలో


రాజీవ్ స్వగృహ భూమి

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమాశం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు 104 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. 2023లో జరిగిన వినాయక నిమజ్జనం కోసం తీరంలో 12 చోట్ల, దేవీ నిమజ్జనం కోసం ఒకచోట సుమారు 300 మంది గజ ఈతగాళ్లను వారంరోజులపాటు నియమించినందున వారందరికీ రోజుకు రూ.500 చొప్పున చెల్లించే అంశాన్ని అజెండాలో చేర్చారు. ఏడాదిన్నర తరువాత ఈ అంశాన్ని పెట్టని అధికారులు ఇప్పుడు అజెండాలో చేర్చడం అనుమానాలకు దారితీస్తోంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.11 (శుక్రవారం సాయంత్రం)
సహర్ : 4.43 (శనివారం ఉదయం)

బోధన కంటే నేర్పించడానికే ప్రాధాన్యమివ్వాలి

» కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి



మాట్లాడుతున్న దేవానందరెడ్డి

భీమునిపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బోధించడం కన్నా నేర్పించడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి పేర్కొన్నారు. భీమిలిలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్‌ను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఛాత్రోపాధ్యాయులతో మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తిలో చేరిన దగ్గరి నుంచి అడిషనల్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన క్రమాన్ని ఛాత్రోపాధ్యాయులతో పంచుకున్నారు. అన్ని వృత్తుల కన్నా ఎంతో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నందుకు ఛాత్రోపాధ్యాయులనుఅభినందించారు. బాధ్యతాయుతంగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా జీవితంలో ప్రాథమిక స్థాయి ఎంతో ముఖ్యమని ఆ దశలో చదివించడం, బోధించడం కన్నా నేర్పించడం వల్ల చిన్నారులకు వికాసం పెంపొందించవచ్చన్నారు. ఛాత్రోపాధ్యాయులకు ఆయన ఉత్తేజపూరిత సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్-బి, పఢాయి-బి శిక్షణ

భీమునిపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మూడు రోజుల పోషణ్-బీ, పఢాయి-బీ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పట్టణంలోని కృష్ణా కాలనీ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.ప్రమీల, బి.అనిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ప్రాధాన్యంపై చర్చలతో వివరణ ఇచ్చారు. పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సామూహిక కార్యక్రమాలను జరిపారు. పిల్లలలో పోషకాహార లోపాలను గుర్తించడం, సూక్ష్మ పోషకాహార లోపాల వారిని గుర్తించడం నివారణకు చర్యలు చేపట్టడంపై వివరించారు. దివ్యాంగ పిల్లలను చేర్చుకోవడం ప్రారంభ ప్రేరణ మరియు బాల్య సంరక్షణపై వివరించారు.

సంగివలస-వలందపేట రహదారికి విముక్తి

» రోడుపై వేసిన మట్టికుప్పలు, ముళ్ల కంచె తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వలందపేట వద్ద రోడ్డుకు అడ్డుగా వేసిన మట్టికుప్పల్ని తొలగిస్తున్న దృశ్యం

తగరపువలస, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సంగివలస వలందపేట గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి కబ్జాకు గురైందని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టికుప్పలను వేసిన వ్యక్తులతో అధికారులు సమావేశం నిర్వహించి, వారి నుంచి రికార్డులను రప్పించి పరిశీలించారు. వీటిని వేయించిన పోణంగి అప్పయ్యమ్మను పిలిపించి రహదారిని అడ్డుకోవడం సరికాదని చెప్పారు. అంతకుముందు భీమిలి మండల తహశీల్దార్ కార్యాలయానికి చెందిన సంగివలస వీఆర్వో రిజ్వానా, సంగివలస సచివాలయ గ్రామ వీఆర్‌ఏ ప్రసన్న, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి సాయిగోపాల్ పరిసర ప్రాంతాల వారితో మాట్లాడి విషయాన్ని ఆరా తీశారు.అనంతరం తొలగింపు చర్యలు చేపట్టారు. రహదారికి అడ్డుగా వేసిన కంచెల నూ తొలగించారు. మట్టికుప్పలను తొలగించడానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. కప్పల మట్టిని రహదారిపై పరిపించి చదును చేయించారు. ఎన్నో సంవత్సరాలుగా రహదారిగా ఉన్న ప్రాంతాన్ని కొందరు తమదని చెప్పడం సరికాదని, రెవెన్యూ రికార్డులలో ఏమైనా పొరపాట్లు ఉంటే సవరిస్తామని అధికారులు చెప్పారు. ముందుగా ఈ కుప్పలను తొలగించడానికి ఈ సమీపంలో ఉంటున్న స్థలాల యజమానులు అంగీకరించలేదు. అధికారులు వారితో మాట్లాడి రికార్డులను పరిశీలించి తొలగించడానికి నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

ఎట్టకేలకు రాకపోకలకు అను కూలంగా చేయడంతో ఈ పరిధిలో నివాసం ఉంటున్న వారు ఆనందం వ్యక్తం చేశారు.

నేవీని సందర్శించిన ఐఏఎస్ ట్రైనీల బృందం



ఐఏఎస్‌ల బృందానికి నేవీ ఆపరేషన్ల గురించి వివరిస్తున్న నేవీ అధికారులు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్ ట్రైనీలు నేవీ పనితీరును తెలుసుకునేందుకు బుధవారం విశాఖలోని తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. వారికి ఇక్కడి అధికారులు తీర ప్రాంత రక్షణ, నౌకాదళం ఆపరేషన్ వ్యవహారాలను వివరించడంతో పాటు పలు యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లను చూపించారు.

ఈఎన్‌సీని సందర్శించిన ఆర్మీ ఉద్యోగులు

గోపాల్‌పూర్‌కు చెందిన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కాలేజీ యువ అధికారులు 29 మంది తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. నౌకాదళం పనితీరు, యుద్ధ నౌకలు, తీర ప్రాంత సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు నౌకలను సందర్శించారు. ఆర్మీ, నేవీ పరస్పర సహకారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి.

తాళ్లవలస అగ్నిమాపక శకటం మరమ్మతులకు దివీస్ సాయం

భీమునిపట్నం (రూరల్) మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపక కేంద్రంలో పాడైన అగ్నిమాపకశకటం మరమ్మతులకు చిప్పాడ దివీస్ యాజమాన్యం రూ.65 వేలు ఆర్థిక సాయం అందించింది. గురువారం అగ్నిమాపక అధికారి శ్రీనివాసరాజుకు దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు చెక్కును అందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని, ఈ సమయంలో ప్రమాదాల నివారణకు శకటం అవసరం ఉంటుందని, అందువల్ల ఇందులో సదుపాయాలు ఇతర మరమ్మతుల కోసం ఈ నిధులను అందించామన్నారు. తక్షణం వాహనాన్ని బాగు చేయించి వినియోగంలోకి తీసుకుని రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో దివీస్ సేఫ్టీ అధికారి చంద్రశేఖర్, సమాజిక సేవా విభాగం అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి-ఆనందపురం రహదారి విస్తరణ వద్దంటూ సీఐటీయూ నిరసన



ధర్నా నిర్వహిస్తున్న స్థానికులు, సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

భీమునిపట్నం (రూరల్) మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి క్రాస్‌రోడ్డు, ఆనందపురం నుంచి భీమిలి వెళ్లే రహదారిని వెడల్పు చేయవద్దని కోరుతూ భీమిలి సీఐటీయూ కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో క్రాస్‌రోడ్డు నుంచి భీమిలి వరకు ఉన్న వివిధ గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా క్రాస్‌రోడ్డు నుంచి గొల్లలపాలెం వరకు 200 అడుగుల మేర రోడ్డు విస్తరణకు నోటీసులు జారీ చేశారని ఆ విధంగా వెడల్పు చేస్తే ఈ రహదారిని అనుకుని ఉన్న వందలాదిమంది నిరుపేదలు ఎటువంటి ఆధారం లేకుండా ఇబ్బందులు పాలవుతారని సీపీఎం పార్టీ 78వ డివిజన్ కార్పొరేటర్ బి.గంగారావు పేర్కొన్నారు. ఈ ధర్నాకు ఆయన విచ్చేసి బాధితులతో మాట్లాడారు. దీనిని వంద అడుగుల మేర వెడల్పు చేస్తే సరిపోతుందని ట్రాఫిక్ అంతగా లేని ఈ రోడ్డును 200 అడుగుల మేర వెడల్పు చేయడం సరికాదన్నారు. మన్యాలపేట, గొల్లలపేట, సంగివలస, కుమ్మరిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది కుటుంబాల వారు ఈ రోడ్డు వెడల్పు వల్ల ఇబ్బందులు పడతారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి ఎస్.అప్పలనాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

దినేష్‌కు గేట్‌లో 23వ ర్యాంక్



సింహాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని శ్రీనివాసనగర్‌లో ప్రాంతానికి చెందిన చింతా దినేష్ గేట్‌లో 23వ ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి ప్రస్తుతం ఏపీ ఎన్ఐటీలో ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తాత ప్రోత్సాహంతో పదిమాసాల శిక్షణ పొంది పట్టుదల కనబరిచి బుధవారం విడుదలైన గేట్ ఫలితాల్లో 23వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా దినేష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఐఐటీలో ఎంటెక్ చేసి మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం పొందటమే లక్ష్యమన్నాడు. దినేష్ తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు హర్షం వ్యక్తం చేసి మిఠాయిలు తినిపించారు. సింహాచలం వాసులు పలువురు దినేష్‌కు శుభాభినందనలు తెలిపారు.

'అప్పన్న కల్యాణోత్సవం విజయవంతం చేస్తాం'



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ సుబ్బారావు

సింహాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమష్టి కృషితో ఏప్రిల్ 8న సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాన్ని విజయవంతం చేస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు అన్నారు. కల్యాణత్సవం నిర్వహణ, గత అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం సింహగిరి అనందనిలయం కాటేజీలో ఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉగాది రోజున పందిరిరాట ఉడుపుతో వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతామని ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు చెప్పారు. ఏప్రిల్ 8న రాత్రి 8 గంటలకు సింహగిరి మాడవీధుల్లో రథోత్సవం, రాత్రి 10.30 గంటలకు వార్షిక తిరుకల్యాణం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో ఈవో చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అనుసరించాల్సిన విధివిధానాలపై నార్త్ ఏసీపీ పృథ్వీరాజ్ తదితర అధికారులతో చర్చించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింహగిరి వర్తక సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్

సింహాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని దుకాణాలలో వ్యాపారాలు చేసుకునే సింహగిరి వర్తకసంఘం గురువారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచన మేర కు కార్పొరేటర్ పి.వి.నరసింహం సారథ్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. నూతన అధ్యక్షునిగా అడివివరం సహకార పరపతి సంఘం పాలకమండలి ఉపాధ్యక్షునిగా ఉన్న బంటుబిల్లి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా తాలాడ రామారావు, ఉపాధ్యక్షునిగా సానబోయిన పైడిరాజులను ఎంపిక చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి కార్పొరేటర్ పీవీ పుష్ప అభినందించారు.

శిల్పారామం అభివృద్ధికి త్వరలో ప్రణాళిక



శిల్పారామంలో పర్యటిస్తున్న సీఈవో స్వామినాయుడు

మధురవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలో ఉన్న శిల్పారామం అభివృద్ధికి త్వరలో ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నట్లు సీఈవో స్వామినాయుడు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా పచ్చదనం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం మధురవాడ శిల్పారామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండేలా మరింతగా మొక్కలు పెంచాలని సూచించారు. అదనపు విద్యుత్తు దీపాలు వేసి ప్రతీ మూలకు రాత్రివేళల్లో వెలుతురు ప్రసరించేలా చూడాలన్నారు. స్టాల్స్‌ను పర్యాటకులకు అందుబాటులో ఉండేలా పనివేళల్లో తెరవాలన్నారు. స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి ఆయనకు వివరాలు అందించారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



మాడవీధిలో ఊరేగుతున్న వెంకటేశ్వరస్వామి

సాగర్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రుషికొండలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తోమాల, సహస్రనామార్చన విష్వక్సేనారాధన, హోమం, పూర్ణాహుతి నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈసందర్భంగా కోలాటం, సామూహిక పారాయణం, వెంకటేశ్వర కల్యాణం నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

రెండో సబ్ రిజిస్ట్రార్ పోస్టు రద్దు?

... 5వ పేజీ తరువాయి

రోహణ్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై మధురవాడలో జాయింట్ -2గా వేశారు. ఈ డిప్యుటేషన్ 2025 మార్చి 31 వరకు మాత్రమేనని అప్పుడే స్పష్టంచేశారు. పెదగంట్యాడలో పెద్దగా లావాదేవీలు లేని కారణంగా డీఐజీ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై నియమించా రు. అయితే ఇటీవల కాలంలో విశాఖలో రియల్ ఎస్టేట్ లావాదేవీలు బాగా తగ్గిపోవడం, ముఖ్యంగా పరిపాలనా రాజధాని వస్తుందని ప్రచారం జరిగిన మధురవాడ ప్రాంతంలో పెద్దగా కార్యకలాపాలు సాగకపోవడంతో అక్కడ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టును ఈ నెలాఖరు తరువాత కొనసాగించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. అక్కడ పనిచేస్తున్న రోహణ్‌కుమార్‌ను తిరిగి పెదగంట్యాడ పంపాలని భావిస్తున్నారు. పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ దీప్తి ప్రియ ఇటీవల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అక్కడ కూడా మూడు నెలలు సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయం నడిపించారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడం, లక్ష్యాలు పూర్తిచేయాల్సిన అవసరం ఉండడంతో ఆమె ఇటీవలే తిరిగి విధుల్లో చేరారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అన్ని కార్యాలయాలను డిప్యుటేషన్లు లేకుండా పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్లతో నడపనున్నారు.

ఈకేవైసీకి డెడ్‌లైన్

... 5వ పేజీ తరువాయి

వాహనాలు ఖాళీగా ఉంటున్నందున వారి సేవలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. అంతే తప్ప పూర్తిగా డీలర్లకు బాధ్యతలు అప్పగిస్తే ఈకేవైసీ పూర్తిచేయడం సాధ్యం కాదని స్పష్టంచేస్తున్నారు.

బియ్యం కార్డులో పేరు కలిగిన ఆరు నుంచి 60 సంవత్సరాల వయస్సుగల సభ్యులంతా ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని ఇన్‌చార్జి డీఎస్‌వో కల్యాణి తెలిపారు. తమ సమీపంలో ఉన్న రేషన్ డిపో వద్దకు వెళ్లి ఈపోస్ మిషన్‌లో వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తిచేయాలని, వివరాలకు అందుబాటులో ఉన్న సచివాలయాలు, తహసీల్దార్/సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రతించాలన్నారు. ఈ ప్రక్రియ మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు.

వైసీపీకి ఆరుగురు కార్పొరేటర్లు గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే కూటమి బలం 66కి పెరుగుతుంది. వీరుకాకుండా ఎక్స్ అఫీషియో సభ్యులుగా కూటమికి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 11 మంది ఉన్నారు. వారితో కలిపితే కౌన్సిల్‌లో కూటమికి 77 మంది బలం ఉన్నట్టవుతుంది. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యులు బలం అవసరం.

టీచర్ల సీనియారిటీ జాబితాలో మళ్లీ తప్పులే

... 5వ పేజీ తరువాయి

సంఘ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా గురువారం అందుబాటులో ఉంచిన జాబితాపై ఈనెల 24వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నారు.పదో తరగతి ఇన్విజిలేషన్ విధులు కాదని అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి విశాఖ వచ్చి అభ్యంతరాలు ఎలా ఇస్తారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు ఇచ్చే ప్రక్రియ ఎందుకు చేపట్టరని అంటున్నారు. తొలుత అభ్యంతరాలు ఆన్‌లైన్‌లోతీసుకుని తరువాతసంబంధిత టీచర్ నుంచి వివరణ తీసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, ఏపీ హౌసింగ్‌బోర్డు మెంబరు పంచకర్ల సందీప్ గురువారం దర్శించుకున్నారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి : జేసీ

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పట్టణభూగరిష్ఠ పరిమితి(అర్బన్ ల్యాండ్ సీలింగ్) చట్టం పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూముల క్రమబద్ధీకరణకు 2023, ఫిబ్రవరి 24న జారీ చేసిన జీవో 84 మేరకు అదే సంవత్సరం డిసెంబరు 31లోగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇదే జీవోను కొనసాగిస్తూ ఈ ఏడాది జనవరి 27న జీవో నంబరు. 27 జారీ చేశారన్నారు.

దీని ప్రకారం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టానికి లోబడి దరఖాస్తు చేసుకునే ఆక్రమణదారులు 2019, మే ఒకటో తేదీ నాటికి సదరు భూమి ఆక్రమణలో ఉన్నట్టుగా రిజిస్టర్ డాక్యుమెంట్, జీవీఎంసీ నుంచి ప్లాన్, ఇంటి పన్ను రశీదు, నీటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు నకళ్లతో ఈ ఏడాది డిసెంబరు 31లోగా సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల వరకు ఉచితంగా పట్టా అందజేస్తారని, 151 గజాల నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువకి 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాల దాటినవారు 100 శాతం విలువ లెక్కించి, అందులో మొదటి విడతగా 50 శాతం నగదుకు 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాంగ్ సీలింగ్' పేరిట డీడీ /బ్యాంకర్ చెక్‌ను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

73 చోరీ కేసుల్లో 103 మంది నిందితుల అరెస్టు

రూ.93.21 లక్షల సొత్తు స్వాధీనం



పోగొట్టుకున్నవారికి చోరీ సొత్తు అప్పగిస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన చోరీ కేసుల్లో 73 కేసులను ఛేదించి 103 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 109 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో దోపిడీ మూడు, పగటిపూట ఇళ్లలో చోరీలు మూడు, రాత్రి పూట చోరీలు 15, గొలుసు అపహరణలు నాలుగు, మోటార్‌సైకిళ్ల చోరీలు 13 కాగా మిగిలినవి ఇతర కేసులు ఉన్నాయన్నారు. వీటితోపాటు రూ.60 లక్షల విలువచేసే 419 మొబైల్ ఫోన్‌లను కూడా రికవరీ చేశామన్నారు. నిందితుల నుంచి 660 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి, రూ.2.73 లక్షల నగదు, 14 మోటార్ సైకిళ్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, లారీ బ్యాటరీలు రెండింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రికవరీ సొత్తును హక్కుదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ లతామాధురి, క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

29న జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమవడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 29న ఏర్పాటుచేయాలని జీవీఎంసీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో సమావేశానికి హాజరుకావాలని నోటీసుతోపాటు బడ్జెట్ ముసాయిదా ప్రతులను గురువారం కార్పొరేటర్లందరికీ అందజేశారు. 29వ తేదీ నాటికి కొత్త కమిషనర్‌ను నియమిస్తే ఆయన ఆధ్వర్యంలోనే బడ్జెట్ సమావేశం జరుగుతుందని, ఎవరినీ నియమించకపోతే ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ హాజరవుతారని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

రాజీవ్ స్వగృహ భూమి డీ నోటిపై

... 5వ పేజీ తరువాయి

సాధారణ ఎన్నికలకు ముందు ఈ-వేలం నిర్వహించింది. అప్‌సెట్ ధర గజం రూ.60 వేలుగా నిర్ణయించగా, వాటిలో సగం ప్లాట్లు గజం రూ.60,500 చొప్పున పలువురు పాడుకున్నారు. వాటి ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. అయితే ఆ భూమి నెల రోజుల క్రితం వరకు 22-ఏలోనే ఉంది. ఆ ప్లాట్లు కొనుక్కున్న వారు రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా అడిగితే కార్పొరేషన్ అధికారులు తెల్లముఖం వేశారు. అది ప్రభుత్వ భూమిగా ఇంకా రికార్డుల్లో ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేయలేకపోయారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దాంతో ప్రభుత్వం అన్నీ పరిశీలించి వాటిని 22-ఏ నుంచి తప్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

త్వరలోనే రిజిస్ట్రేషన్లు

రాజీవ్ స్వగృహలో ప్లాట్లు కొనుక్కున్న వారిలో పూర్తి మొత్తం చెల్లించిన వారందరికీ వీలైనంత త్వరగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తామని హౌసింగ్ అధికారి సుబ్బరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అక్కడ ఇంకా 39 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం కొత్తగా నిర్ణయించిన ధర గజం రూ.75,560 చొప్పున అప్‌సెట్ ధర నిర్ణయించి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఈ-కొనుగోళ్ల పోర్టల్ ద్వారా వేలం నిర్వహిస్తామన్నారు.

అక్రమాలకు సహకారం!

... 5వ పేజీ తరువాయి

ఒక్క ఏడాది కూడా ఎందుకు బయట పెట్టలేదు అన్నదే ఇప్పుడు ప్రశ్న. సుహనీ షాపింగ్ మాల్ ఒప్పందంలో చాలా తప్పులు జరిగాయి. వందల కోట్ల రూపాయల వ్యవహారం కాబట్టి చాలా జాగ్రత్తగా ఆడిట్ చేయాలి. కానీ ఆ దాఖలాలు లేవు. ఒకవేళ అలా చేసి ఉంటే గుర్తించిన తప్పులను డీసీఏఓ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తెలియజేసి ఉండేవారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. అక్కడ ఆడిటింగ్‌కు అనుకూలమైన వారిని పంపడం, ఏ తప్పులు గుర్తించకుండా, అంతా బాగుందని నివేదికలు ఇవ్వడం వంటి పనులు నిరాటంకంగా సాగుతూ వస్తున్నాయి.

పెరుగుతున్న ఖర్చులు గుర్తించలేరా?

సూపర్ బజార్‌కు గతంలో భవన నిర్వహణకు ఏడాదికి రూ.5 లక్షలకు మించి ఖర్చు కాలేదు. ఇప్పటి మేనేజింగ్ డైరెక్టర్ హయాంలో అది రెట్టింపు అయింది. ఆ పేరుతో గత నాలుగేళ్లలో రూ.60 లక్షలు వెచ్చించారు. ఖర్చు ఒక్కసారిగా పెరిగినప్పుడు ప్రశ్నించి, వాటిని నివేదించాల్సిన బాధ్యత ఆడిటర్లది. అలాగే కంటింజెన్సీ ఆఫీసు నిర్వహణ పేరుతో లక్షల రూపాయల ఖర్చు చూపించారు. వాటిని కూడా ఆడిటర్లు వేలెత్తి చూపించలేదు. వీటన్నింటిపై సరైన విచారణ జరిగి, వాస్తవాలు వెలుగులోకి రావాలంటే...ఇప్పుడున్న డీసీఏఓ స్థానంలో విచారణ బాధ్యతలు వేరొకరికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఈ ఐదేళ్లలో సూపర్ బజార్ లెక్కలు ఆడిటింగ్ చేసిందెవరో గుర్తించి, వేరే వారితో మళ్లీ ఆ లెక్కలు ఆడిట్ చేయించాల్సి ఉంది.

రేషన్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్‌తోపాటు టీడీపీకి చెందిన కార్పొరేటర్‌కు, టీడీపీ స్థానిక నాయకుడికి ప్రతి నెలా మామూళ్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు ఆరోపిస్తున్నారు. గాజువాక సర్కిల్‌లో 146 రేషన్ డిపోలు ఉండగా, 1.33 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతి నెలా రెండు వేల టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. వీటిలో సుమారు 500 టన్నులను ఆ నలుగురు దళారీలే ప్రత్యేకంగా మనుషులను నియమించుకుని కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని సబ్బవరం, చోడవరం సమీపంలోని మిల్లులకు రూ.25 కి విక్రయిస్తున్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేలు మామూళ్లు

రేషన్ బియ్యం కొనుగోలు చేసిన దళారులు వాటిని వ్యాన్‌లలో సబ్బవరం సమీపంలోని అరిపాక, చోడవరం సమీపంలోని వెంకన్నపాలెంలోని మిల్లులకు తరలిస్తున్నారు. రైస్‌మిల్లుల సంఘంలో కీలకంగా వ్యవహరించే ఒక మిల్లు యజమాని ఏ వాహనం ఏ మిల్లుకు వెళ్లాలో ముందుగానే చెబుతాడు. వాహనం ప్రయాణించే మార్గంలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని సిబ్బందితోపాటు అధికారులను కూడా దళారులు మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మార్గంలో ఉన్న ప్రతీ పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.50 వేలు చొప్పున మామూళ్లు అందజేస్తున్నారంటున్నారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు కార్పొరేటర్లుగా ఉన్న కొందరికి, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉండే స్థానిక నేతలు, కార్పొరేటర్లకు కూడా నెలావారీ మామూళ్లు ముట్టజెబుతున్నారని ప్రచారం జరుగుతోంది.

ఇటీవల న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు టన్నుల రేషన్ బియ్యంతో మిల్లుకు వెళుతున్న వాహనాన్ని స్థానికులు కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించినా, కేసు నమోదుచేయకుండా రెండు రోజులు తాత్సారం చేశారనే ఆరోపణలు వచ్చాయి. చివరకు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదుచేసినట్టు పోలీసులు ప్రకటించారనే ప్రచారం జరిగింది. మిల్లులకు చేరిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు కొద్దిగా పాలిష్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి లెవీ కింద అప్పగించేస్తున్నారు. దీనివల్ల మిల్లర్లకు పెద్దగా ఖర్చు, శ్రమ లేకుండానే కిలోకు రూ.పది వరకు మిగులుతోంది. రేషన్‌బియ్యం మాఫియాపై పోలీసులు, విజిలెన్స్ అధికారులతోపాటు పౌర సరఫరాల శాఖ అధికారులు ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

ఆనందపురం జంక్షన్‌ను అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రికి ఎంపీ శ్రీభరత్ లేఖ



కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ అందజేస్తున్న శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఆనందపురం జంక్షన్ ట్రాఫిక్ సమస్యల కేంద్రంగా మారిందని, దీనిని అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని విశాఖ ఎంపీ శ్రీభరత్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రిని ఆయన కలిసి ఓ లేఖను అందజేశారు. విశాఖ నుంచి వెళ్లే వాహనాలను... ముఖ్యంగా ఆర్టీసీ బస్సులను ఆనందపురం జంక్షన్‌లో పూల వ్యాపారుల కోసం ఆపుతున్నారని పేర్కొన్నారు. అక్కడ జంక్షన్ మధ్యలో భారీ ఐల్యాండ్ ఉందని, దానిని తొలగించి లెవెలింగ్ చేస్తే చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టవలసిందిగా కోరారు.

శ్రీనగర్‌లో భారీ చోరీ

» 15 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్‌లో భారీ చోరీ జరిగింది. సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు అపరహణకు గురయ్యాయి. గాజువాక క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో టి.నాగలక్ష్మి అనే మహిళ ఒకరే ఉంటున్నారు. బుధవారం రాత్రి ఓ వివాహానికి ఆమె హాజరై తిరిగి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చారు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో అనుమానంతో చూడగా, లోపల ఉంచిన 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో నాగలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి వెనక తలుపును విరగ్గొట్టి దొంగలు చొరబడినట్టు పోలీసులు గుర్తించారు. కాగా బీరువాకు తాళాలు వేసి దానికే వదిలివేసినట్టు పోలీసులు పేర్కొన్నా రు. సంఘటనా స్థలాన్ని క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ కె.శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **రాజుగారి దొంగలు :** శ్రీకన్య-2 (గాజువాక)
- **శబ్దం :** సంగం,శారద, సౌజన్య (గోపాలపట్నం),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం),తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 38, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 20, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఆరుబయట చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ 11వ వార్డు పారిశుధ్య సిబ్బంది వినూత్న ప్రణాళిక



చెత్త తరలించిన చోట ముగ్గులు వేసి పూల కుండీలు ఏర్పాటు చేసిన దృశ్యం



చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా వేస్తామంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆరిలోవ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ స్థలాల్లో చెత్తలు వేస్తే ఆ ప్రాంతమంతా దుర్గం ధపూరితంగా మారి ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతాయని, దీనివల్ల అనేక వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి పాలవుతారంటూ జీవీఎం సీ శానిటరీ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో మార్పురావాలి. ఈ మార్పు వచ్చినపుడు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. జీవీఎంసీ 11వ వార్డులో గల కొన్ని ప్రాంతాల్లో స్థానికులు వేసిన చెత్తను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో తొలగించారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంతమంతా ముగ్గులు వేసి పరిశుభ్రం చేశారు. అక్కడ పూల మొక్కలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేసి 'ఇక్కడ చెత్త వేసిన వారు రూ.1000 జరిమాన చెల్లించవలసి ఉంటుంది' అని హెచ్చరిక జారీ చేశారు. మీ ఇంటిలో చెత్తను మీ ఇంటికి వచ్చే జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందించి పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. స్థానికంగా ఈ ఫ్లెక్సీ అందరినీ ఆకట్టుకుంటోంది.

అబుల్ కలాం ఆజాద్ ట్రస్టు ఆధ్వర్యంలో పిచ్చుకలకు ఆహార బాక్సులు ఏర్పాటు



చెట్లకు ఆహార బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్న ట్రస్టు సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం)లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ట్రస్టు ఆధ్వర్యంలో చెట్లకు పిచ్చుకల ఆహార బాక్స్‌లు, నీళ్ల కోసం మట్టి సాసర్‌లను గురువారం అమర్చారు. ఏయూ ఉన్నతపాఠశాలతో కలిసి ట్రస్టు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.నాగరాజకుమారి మాట్లాడుతూ ఎండలు అధికమవుతున్న ఈ సమయంలో మూగజీవులకు ఆహారం, నీరు అందిస్తున్న ట్రస్టు సేవలు అభినందనీయం అన్నారు. ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఖాజారహమతుల్లాను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు నగరంలోని ఎన్జీవోలు స్ఫూర్తిగా తీసుకుని వివిధ ప్రదేశాలలో అమర్చాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టు ఛైర్మన్ మాట్లాడుతూ సెల్‌టవర్ల రేడియేషన్ వలన ఊర పిచ్చుకలు నానాటికీ నశించిపోతున్నాయని, ఈ విషయంలో పర్యావరణవేత్తలు సామాజిక వేత్తలు తగు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

డీఆర్‌ఎం తనిఖీలు



మంచినీటి కుళాయిని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దువ్వాడ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్‌ఎం లలిత్ బొహ్రా గురువారం తనిఖీలు చేశారు. ముందుగా దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల మౌలిక సదుపాయాలు, స్టేషన్ అభివృద్ధి, యార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అక్కడ నుంచి పర్లాకిమిడి స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలలో భాగంగా వెయిటింగ్ హాల్స్, పాదచారుల వంతెన, రైల్వే కార్యాలయాల నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ నుంచి నౌపడ స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకంలో భాగంగా స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

» శ్రామిక్ యూనియన్ ఆరోపణ

» వైద్యుల తీరుపై హైపవర్ కమిటీ విచారణకు డీఆర్‌ఎం ఆదేశం



రైల్వే ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల చిన్నారి మృతికి వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో వైద్యులు కారణమని ఆరోపిస్తూ తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ యూనియన్ గురువారం ఆందోళన చేపట్టింది. అనారోగ్యంలో ఆసుపత్రికి వచ్చిన చిన్నారికి అత్యవసర వైద్య సేవలందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ శాఖలో ట్రాక్‌మన్ శ్రీనివాసరావు అనే ఉద్యోగి కుమార్తె అన్విక (3) బుధవారం ఉదయం అస్వస్థతకు గురైంది. వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్న అన్వికను రైల్వే ప్రధాన ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర సేవలందించాలని విన్నవించినా ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోకుండా అవుట్ పేషెంట్ (ఓపీ)లో చూపించిన తర్వాతే మిగిలిన చికిత్స జరుగుతుందంటూ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. గంటల తరబడి ఓపీలో పడిగాపులు తర్వాత వైద్యులు తనిఖీ చేసి వెంటనే క్యాజువాల్టీ వార్డులో జాయిన్ చేయాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లిన తర్వాత చిన్నారికి ఇంజక్షన్, సెలైన్ బాటిల్స్ పెట్టి పర్యవేక్షణలో ఉంచారు. తర్వాత ఎలాంటి చికిత్స చేయకపోవడంతో గురువారం వేకువజామున అన్విక ఆరోగ్య పరిస్థితి విషమించింది.చిన్నారిలో ఎలాంటి చలనం లేకపోవడమే కాకుండా పల్స్ పడిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. మెడికవర్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో చిన్నారి మృతి చెందినట్టు గుర్తించిన తల్లిదండ్రులు ఆర్తనాదాలతో తిరిగి రైల్వే ఆస్పత్రికి వచ్చి వైద్యుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న శ్రామిక్ యూనియన్ నాయకులు వెంటనే అక్కడకు చేరుకుని చిన్నారి అన్వికకు జరిగిన అన్యాయం, వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా యూనియన్ నాయకులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. దీనిపై అత్యున్నత కమిటీ (హైపవర్) విచారణ చేపట్టి చిన్నారి మృతికి కారకులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కంబాలకొండ పార్కులో నీటి తొట్టెల ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన నీటి తెట్టెలు

ఆరిలోవ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కంబాలకొండ నేచరల్ పార్కులో జంతువులు దాహార్తిని తీర్చుకోవడానికి నీటి తొట్టిలను ఏర్పాటు చేసినట్టు రేంజర్ శాస్త్రి తెలిపారు. వేసవి కారణంగా జంతువులు తాగునీటికి ఇబ్బందులకు ఎదురవకుండా ఉండేందుకు ఈ పార్కులో సుమారు 15 వరకు నీటి తొట్టిలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు ఈ నీటి తొట్టెలలో నీరు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఖాళీ చేసి మళ్లీ కొత్తగా నీరు నింపనున్నట్టు చెప్పారు. అలాగే జంతువులకు ఎటువంటి అనారోగ్యం కలగకుండా ఉండేందుకు అక్కడ అక్కడ అక్కడ ఉప్పు గడ్డలను కూడా చెట్లకు కడుతున్నట్టు తెలిపారు, జంతువులు తమ నాలుకతో వాటిని గీకు తాయని తెలిపారు. ఈ అడవులలో జింకలతో పాటు అడివి కుక్కలు, అడవి పందులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇంతవరకు ఈ పార్కులో చిరుతల జాడ లేదని ఆయన తెలిపారు.

పిచ్చుకల పరిరక్షణ అందరి బాధ్యత

» జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ



నీటి తొట్టెలు, వరి కంకులు ఏర్పాటు చేస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ, గ్రీన్ క్లైమెట్ ప్రతినిధులు జేవీ రత్నం, ఏయూ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పిచ్చుకలను పరిరక్షించే క్షేబాధ్యత అందరిదీ అని జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. లాసన్స్‌బే కాలనీలోని శాంతి ఆశ్రమంలో గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి సత్యన్నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆశ్రమంలో పిచ్చుకల కోసం గూళ్లు, నీటి కోసం పాత్రలు, ధాన్యం కుచ్చులను స్వచ్ఛంద సంస్థ అందచేసింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమం ప్రతినిధి ఆదిత్య, జనసేన నాయకులు పి.ఆదినారాయణ, వనమాలి ప్రతినిధి రమాదేవి, ఏయూ సోషల్ వర్క్స్ విద్యార్థులు కేదాత్రి, నిఖిత, భానుప్రసాద్, వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించండి

జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు



ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లలో ఆటలాడడం ఆత్మహత్యలకు దారితీస్తాయని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు చెప్పారు. మద్దిలపాలెంలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ఆయన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఎంత ప్రమాదకరమో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఊబిలో పడి 1500 మందికి పైగా యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, నాయకులు దేవర శంకర్, హరికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

22న జిల్లెళ్లమూడి అమ్మవారి ఆలయ రజతోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ నిర్వాహకులు కుసుమచక్రవర్తి తదితరులు

పెదవాల్తేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో వెలసిన శ్రీజిల్లెళ్లమూడి అమ్మవారి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు కుసుమ చక్రవర్తి తెలిపారు. గురువారం పెదవాల్తేరులోని శ్రీజిల్లెళ్లమూడి అమ్మవారి ఆలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆలయం స్థాపించి ఈ నెల 22వ తేదీకి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మార్చి 23వ తేది ఆదివారం సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారనితెలిపారు. మాతృశ్రీ అధ్యయన పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో కన్వీనర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ అతుకూరి వెంకటేశ్వర యోగి, సహ-కన్వీనర్‌గా ఎమ్మెస్ శరశ్చంద్ర కుమార్ తదితరులు పాల్గొననున్నట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించే అవకాశం రావడం లేదు

» అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దేశ్‌పాండే



సమావేశంలో మాట్లాడుతున్న దేశ్‌పాండే, సమాఖ్య నేతలు

సిరిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా మూడు లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో నేరుగా చర్చించే అవకాశం రావడం లేదని అఖిలభారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు దేశ్‌పాండే ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హోటల్ మేఘలయాలో విశాఖపట్నం జిల్లా బ్యాంకు విశ్రాంత సమాఖ్య ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై యుఎఫ్‌బీయూతో చర్చించినా, వారు బ్యాంకుల్లో పని చేస్తున్న వారిపైనే శ్రద్ధ చూపుతున్నారని, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మాత్రం శ్రద్ధ పెట్టడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ జరగనప్పుడు, విశ్రాంత ఉద్యోగులకు మూల వేతనం ఆధారంగా పెన్షన్ సవరణ చేస్తున్నారన్నారు. 1986 నుంచి బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ విధానం అమలు చేస్తున్నప్పటికీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ జరగడం లేదన్నారు. కాబట్టి సమస్యలపై సంఘటితంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పీవీ రమణకుమార్, తెలంగాణ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'

వెంకోజీపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): యువతరం పారిశ్రామికవేత్తలు ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం తన కార్యాలయంలో హెచ్‌ఆర్‌ఎం విద్యార్థులను అభినందించారు. ఇటీవల ప్రాంగణ నియామకాల్లో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ సంస్థలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

దర్జాగా ప్రభుత్వ స్థలంలో నివాసం

» గోశాల నిర్వాహణ

» ఫిర్యాదు చేసినా స్పందించని జీవీఎంసీ అధికారులు



ప్రభుత్వ స్థలం ఆక్రమించి వేసిన రేకుల షెడ్డు

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై చిన్న తోపుడు బండి పెట్టి చిరువ్యాపారం చేసుకుంటేనే చూస్తూ ఊరుకోని పట్టణ ప్రణాళిక అధికారులకు సుమారు 50 గజాల రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలంలో దర్జాగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు ఏడాదికి పైగా ఓ కుటుంబం ఇక్కడ నివాసముంటున్నా పట్టణ ప్రణాళిక అధికారులకు ఎందుకు కానరావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది చాలదన్నట్టు పక్కనున్న ఆలయ అర్చకులు నివాస షెడ్డుకు తోడుగా గోశాలను నిర్వహిస్తున్నారు. ఇదీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ శివాలయం వద్దనున్న ప్రభుత్వ స్థలం దుస్థితి. తొలుత ఈ కుటుంబం వారు ఇక్కడున్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలంలో అక్రమంగా నివాసం ఉండేవారు. స్థలాలన్నీ వేలంపాటలో విక్రయించిన తరువాత స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి ఖాళీ చేయించారు. దీంతో ఈ కుటుంబీకులు శివాలయం గోడకు ఆనుకుని ఉన్న విలువైన స్థలంలో ఓ రేకుల షెడ్డును వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ విషయమై 2023, జూలై 17న ఆలయ అర్చకులు ఒకరు జీవీఎంసీలో ఫిర్యాదు చేయగా, సమస్యను పరిష్కరించకుండానే అదే ఏడాది డిసెంబరులో సమస్య పరిష్కరించాం అని స్పందన రిప్లై లేఖను ఫిర్యాదుదారుడికి పంపించారు. అయితే ఇప్పటి వరకుకూ ఆక్రమణను ఎవరూ అడ్డుకునే వారే లేరు.

కాగా ఈ షెడ్డులో నివాసముంటున్న వారు అసాంఘిక కార్యకలాపాలను కూడా నిర్వహిస్తున్నారని మరికొంతమంది ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయమై స్పందించి ఆక్రమణను తొలగించి, విలువైన స్థలాన్ని పరిరక్షించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏప్రిల్ 4 నుంచి కరకచెట్టు పోలమాంబ వార్షికోత్సవాలు

» ఆలయ కార్యనిర్వహణాధికారి గాయత్రి



పెదవాల్తేరు, మార్చి 20 :(ఆంధ్రజ్యోతి) స్థానిక పెదవాల్తేరులో వెలసిన శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి మే 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాయత్రి తెలిపారు. అమ్మవారిని 14 గ్రామాల ప్రజలు ఆరాధిస్తారని చెప్పారు. వార్షిక జాతర మహోత్సవం పురష్కరించుకుని గురువారం పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో వివిధ విభాగాల అధికారులతో సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్ అధ్యక్షతన సయన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో గాయిత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 4 నుంచి మే 6వ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 4న పందిరి రాట మహోత్సవం, 6న పండుగ చాటింపు, 7న అమ్మవారి దేవర పండగ (పుట్టబంగారం తెచ్చుట) 14న తొలేళ్లపండగ, 15న అనుపు ఉత్సవం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 22న మారువారం పండగ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఏప్రిల్ 26న మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. పండుగ నేపథ్యంలో దేవస్థానంలో సకల ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టి. అన్నపూర్ణ, 3 టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ, ట్రాఫిక్ సీఐ, గ్రామ సేవ సంఘం సభ్యులు, జీవీఎంసీ, ఫైర్, ఫుడ్ హెల్త్, శ్రీహరి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సీనియార్టీ జాబితాలో అభ్యంతరాలపై 24 వరకు అవకాశం : డీఈవో

ఆరిలోవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియార్టి జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని ఈ నెల 24లోగా జిల్లా విద్యాశాకాదికారి కార్యాలయానికి సమర్పించాలని జిల్లా విద్యాశాకాదికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు పాఠశాల విద్యాశాఖ పరిదిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు, సాధారణ సీనియారిటీ జాబితాను మొదటి జాబితాలో గల అభ్యంతరాలు పరిష్కరించినట్టు చెప్పారు. వాటిని విశాఖ జిల్లా విద్యా శాఖ వెబ్ సైట్‌లోనూ, కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్టు ఈడీవో తెలిపారు.

అందజేయాల్సిన వివరాలు

అభ్యంతరాల కోసం సదరు ఉపాధ్యాయుడు/ ఉపాధ్యాయురాలి పూర్తి పేరు, ఎక్కడ పని చేస్తున్నాడో అందుకు సంబంధించిన వివరాలు, ఈఎంపీ ఐడీ తెలియ జేయాలన్నారు. సీనియారిటి జాబితాలో ఎక్కడ తప్పిదం జరిగిందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు లేదా సంబంధిత ఆధారాలు తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఆధారాలు సమర్పిస్తేనే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ లోగా సమర్పించాలన్నారు. ఈ పిర్యాదుల పరిష్కారానికి కమిటీ అభ్యంతరాలు పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని సంబందిత ప్రధానోపాధ్యాయుల/ ఉపాధ్యాయురాలికి తెలియజేస్తుందని డీఈవో పేర్కొన్నారు.

కాలియోగ్రఫీ శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేత



ధ్రువపత్రాలు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ ఖాజారహమతుల్లా

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : గత నెల నుంచి మౌలానా అబ్దుల్ కలాం ట్రస్టు ప్రతినిధులకు ఏయూ పాఠశాల విద్యార్థులకు కాలియోగ్రఫీలో శిక్షణ కోర్సు నిర్వహించి గురువారం విద్యార్థులకు అర్హత పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిక్షకుడు ఎర్రాజీరెడ్డిని దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సులోమి, సీనియర్ ఉపాధ్యాయిని డాక్టర్ దయాపాక్షి, ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఖాజారహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పుస్తకావిష్కరణ

వెంకోజీపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ఏయూలోని భూగర్భశాస్త్ర విభాగంలో "మైనింగ్ భూగర్భశాస్త్ర పద్దతులు, ఖనిజ నిల్వల అంచనా" అనే పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ్‌రావు హాజరయ్యారు. ఈ పుస్తకాన్ని ఎన్‌ఎండీసీ లిమిటెడ్ సంస్థలోని భూగర్భశాస్త్ర విభాగం మాజీ అధికారి, భూగర్భశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి పీఎస్ఎన్‌మూర్తి రచించారు. ఈ సందర్భంగా భూగర్భశాస్త్ర విభాగం విభాగాధిపతి కెఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశ్రాంత గ్రంథాలయాధికారి జనార్ధనరావు, ప్రధానగ్రంథాలయాధికారి జీఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినతికి సీఎం హామీ



సీఎం చంద్రబాబును కలిసిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పరిష్కారం కాని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తనవంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో సైన్స్ వర్కుషాపు ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్' అనే అంశంపై ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రసాయనిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వర్కుషాపు గురువారం ప్రారంభమైంది. వర్కుషాపును ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ బెంగళూరు ఐఐఎస్సీకి చెందిన ప్రొఫెసర్ ఎస్.నటరాజన్, ప్రొఫెసర్ బాలాజీ జాగీర్దార్‌లు ఉపన్యాసకులుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తొలిరోజ నానో మెటీరియల్స్, ఇనార్గానిక్ మెటీరియల్స్, హైడ్రోజన్ ఇంధన ఉపయోగాలు అనే అంశాలపై ఉపన్యాసాలిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.ఆర్.ప్రసాద్, కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.కళ్యాణరామ్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలల రసాయన శాస్త్ర అధ్యాపకులు, నిపుణులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాష్ ప్రోగ్రాం ద్వారా గురువారం ప్రథమ చికిత్స కిట్ అందజేశారు. ఈ కిట్‌ను ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరసకు ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.రేణుక, ఎఫ్ఎల్ఎన్ టీచర్ డి.ధరణి అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, డి.నిర్మల, ఎ.సునంద్, పి.లలిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి కప్పరాడలో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, మెట్లు నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సహకారంతో కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, గురువోజీ, బీజేపీ నాయకుడు జి.అరుణ్‌బాబు, గుణుపూడి అరుణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి జ్యోతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వార్డు టీడీపీ నాయకురాలు పెంటకోట స్రవంతి గురువారం ప్రారంభించారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని స్థానికులు వార్డు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకురావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే విష్ణుకుమార్ దృష్టికి టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించారు.

శాంతితోనే దేశాభివృద్ధి



నరవకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శాంతితోనే దేశాభివృద్ధి సాధ్యమని విద్యా సామాజిక వేత్త నరవ ప్రకాశరావు అన్నారు. యునైటెడ్ రిలీజియన్స్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో జరిగిన 'శాంతి-అభివృద్ధి' సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశాభివృద్ధిలో మత సామరస్యం అవసరమన్నారు. అందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతి నెలకొల్పడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసాన్ని ఆయన సమర్పించారు. అనంతరం ప్రకాశరావు ప్రసంగాన్ని అభినందిస్తూ యూఆర్ఐ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ అబ్రహం, సౌత్ ఇండియా ఆఫీసర్ మట్టుకుట్టీ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

సీతంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాధాకృష్ణ మందిరం ప్రాంతంలో నివాసం ఉంటున్న వంగ విజయలక్ష్మి (52) గురువారం ఉదయం ఇంటి నుంచి కాలినడకన బయలుదేరి సీతంపేట నుంచి గాంధీనగర్‌కి వెళ్లే వైపు జాతీయ రహదారి దాటుతుండగా సత్యం కూడలి నుంచి గురుద్వార కూడలి వైపు వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఢీకొట్టాడు. ఆమె రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమైందని ద్వారకా పోలీసులు తెలిపారు. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాలు, క్షతగాత్రురాలి ఫిర్యాదుతో సీఐ రమణ కేసు విచారణ చేపట్టారు.

జాతర మహోత్సవాలకు శ్రీకారం



పూజా కార్యక్రమాల్లో మాలధారణ వ్యక్తులు, అర్చకులు



రేణుక యల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

మురళీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29 వరకు ఉత్సవాలు చేపట్టనున్నట్టు ఆలయ ఈఓ, అర్చకవర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పూజాదికాలు ఆరంభించినట్లు అర్చకుడు బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ సేవా సంఘం సభ్యులతో అమ్మవారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ చేపట్టారు. భక్తులు, మాలధారణ వ్యక్తుల సమక్షంలో సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, విశేష పుష్పాలంకరణ, దీపారాధన సేవలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు.

గాంధీనగర్‌లో ఉత్సవాలకు ఏర్పాట్లు

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు గాంధీనగర్‌లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 29న తొలేళ్లు, 30న ప్రధాన పండగ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. అమ్మవారి మాలధారణ భక్తుల పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలేళ్ల ఉత్సవం రోజు అమ్మవారి ఘటాలతో ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం తదితర ఘట్టాలు ఉంటాయన్నారు.



బర్మాక్యాంప్‌లో ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

అల్లిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ రామారావు జంక్షన్ అచ్చియ్యమ్మపేట రేణుక యల్లమ్మ 25వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, వైద్యులు కళా వెంకటరావులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ గౌరవ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బి.పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బొడ్డేటి ప్రసాద్, గనగళ్ల సత్య, కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో అంధకారం తొలగింది



పిల్లల పార్కుల్లో వెలిగిన విద్యుత్ దీపాలు



బస్‌బే వద్ద ఇంకా తొలగని చీకట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు వరుసల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్, పిల్లల పార్కుల్లో అంధకారం తొలగిపోయింది. విద్యుత్ దీపాల వెలుగుతో పార్కులు మళ్లీ మెరిసిపోతున్నాయి. గురువారం ఆంధ్రజ్యోతిలో 'అంధకారంలో పార్కులు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి పార్కుల్లో దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పార్కులకు వచ్చిన వాకర్లు, పిల్లలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో లైట్లు వెలిగినా పక్కనే ఉన్న బస్ బే పరిసరాల్లో ఇంకా చీకట్లు తొలగలేదు. అక్కడ ఇంకా అంధకారం రాజ్యమేలుతోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే చాలా మంది ప్రయాణికులు ఈ బస్‌బే వద్ద బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఆ ప్రాంతం చీకటిగా ఉండడం వల్ల ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. చీకటిగా ఉండడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి బస్ బేలోనూ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోగనిరోధక శక్తి పెంపుతోనే వ్యాధుల నివారణ సాధ్యం

మహారాణిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారం తీసుకుంటే శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చునని ప్రముఖ న్యూట్రీషియన్ కృష్ణస్వామి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు.. రోగనిరోధక శక్తి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక వైరస్‌లు విజృంభించే అవకాశం పొంచి ఉందని, వాటి బారి నుంచి కాపాడుకోవటానికి ఔషధ సేవనం కన్నా ముందు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మనం నిత్యం తీసుకునే పోషక పదార్థాలతో కూడిన ఆహారంతోనే ఇది సాధ్యమని అన్నారు. ఆహారంలో విటమిన్ సి అందించే నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్ష వంటి వాటితో పెరుగుతుందన్నారు. వివిధ రకాల ఆకుకూరలు, వెల్లుల్లి, బాదం వంటి వాటిలో కీలకపాత్ర పోషించే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కలిగి ఉంటాయని తెలిపారు. ప్రస్తుత తరుణంలో రోగనిరోధక శక్తిని అందించే ఆహారాన్ని ప్రతీ ఒక్కరూ స్వీకరించాలని కృష్ణస్వామి సూచించారు.

'కొత్త'గా చెత్త ప్రాంతాలు



నందగిరినగర్‌లో ముగ్గు వేసి మొక్కలు పెట్టిన అధికారులు

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పోగైన చెత్తను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను పాలిథిన్ కవర్లు, కాగితాల్లోచుట్టి రివ్వున విసిరేయడం చాలామందికి అలవాటు. గ్రేటర్ 42, 43 వార్డుల్లో ఇలా ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే ప్రాంతాలను గ్రీన్‌స్పాట్‌గా తీర్చిదిద్దాలని జీవీఎంసీ అధికారులు సంకల్పించారు. స్థానికులకు కనువిప్పు కలిగేలా చెత్త వేస్తున్న ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గు వేశారు. అక్కడ చుట్టూ కొన్ని మొక్కలు పెట్టారు. ఇంటింటికీ వస్తున్న పారిశుధ్య కార్మికులకు చెత్త అందించాలే తప్ప ఎక్కడబడితే అక్కడ వేయరాదని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



గ్రీన్‌పార్కు వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

మహారాణిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు డిమాండ్ చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రీన్‌పార్కు వద్ద ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ స్మార్టు మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లిస్తామన్న హామీని అధికారులు అమలుపరచటం లేదని ఆరోపించారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పనిదినాలు అమలు చేయాలని, 2019 తరువాత వేతనాలు పెంచలేదని తెలిపారు. హామీలు నెరవేర్చి అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అక్రమాలకు సహకారం!

... 5వ పేజీ తరువాయి

ఒక్క ఏడాది కూడా ఎందుకు బయట పెట్టలేదు అన్నదే ఇప్పుడు ప్రశ్న. సుహనీ షాపింగ్ మాల్ ఒప్పందంలో చాలా తప్పులు జరిగాయి. వందల కోట్ల రూపాయల వ్యవహారం కాబట్టి చాలా జాగ్రత్తగా ఆడిట్ చేయాలి. కానీ ఆ దాఖలాలు లేవు. ఒకవేళ అలా చేసి ఉంటే గుర్తించిన తప్పులను డీసీఏఓ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తెలియజేసి ఉండేవారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. అక్కడ ఆడిటింగ్‌కు అనుకూలమైన వారిని పంపడం, ఏ తప్పులు గుర్తించకుండా, అంతా బాగుందని నివేదికలు ఇవ్వడం వంటి పనులు నిరాటంకంగా సాగుతూ వస్తున్నాయి.

పెరుగుతున్న ఖర్చులు గుర్తించలేరా?

సూపర్ బజార్‌కు గతంలో భవన నిర్వహణకు ఏడాదికి రూ.5 లక్షలకు మించి ఖర్చు కాలేదు. ఇప్పటి మేనేజింగ్ డైరెక్టర్ హయాంలో అది రెట్టింపు అయింది. ఆ పేరుతో గత నాలుగేళ్లలో రూ.60 లక్షలు వెచ్చించారు. ఖర్చు ఒక్కసారిగా పెరిగినప్పుడు ప్రశ్నించి, వాటిని నివేదించాల్సిన బాధ్యత ఆడిటర్లది. అలాగే కంటింజెన్సీ ఆఫీసు నిర్వహణ పేరుతో లక్షల రూపాయల ఖర్చు చూపించారు. వాటిని కూడా ఆడిటర్లు వేలెత్తి చూపించలేదు. వీటన్నింటిపై సరైన విచారణ జరిగి, వాస్తవాలు వెలుగులోకి రావాలంటే...ఇప్పుడున్న డీసీఏఓ స్థానంలో విచారణ బాధ్యతలు వేరొకరికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఈ ఐదేళ్లలో సూపర్ బజార్ లెక్కలు ఆడిటింగ్ చేసిందెవరో గుర్తించి, వేరే వారితో మళ్లీ ఆ లెక్కలు ఆడిట్ చేయించాల్సి ఉంది.

రేషన్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్‌తోపాటు టీడీపీకి చెందిన కార్పొరేటర్‌కు, టీడీపీ స్థానిక నాయకుడికి ప్రతి నెలా మామూళ్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు ఆరోపిస్తున్నారు. గాజువాక సర్కిల్‌లో 146 రేషన్ డిపోలు ఉండగా, 1.33 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతి నెలా రెండు వేల టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. వీటిలో సుమారు 500 టన్నులను ఆ నలుగురు దళారీలే ప్రత్యేకంగా మనుషులను నియమించుకుని కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని సబ్బవరం, చోడవరం సమీపంలోని మిల్లులకు రూ.25 కి విక్రయిస్తున్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేలు మామూళ్లు

రేషన్ బియ్యం కొనుగోలు చేసిన దళారులు వాటిని వ్యాన్‌లలో సబ్బవరం సమీపంలోని ఆరిపాక, చోడవరం సమీపంలోని వెంకన్నపాలెంలోని మిల్లులకు తరలిస్తున్నారు. రైస్‌మిల్లుల సంఘంలో కీలకంగా వ్యవహరించే ఒక మిల్లు యజమాని ఏ వాహనం ఏ మిల్లుకు వెళ్లాలో ముందుగానే చెబుతాడు. వాహనం ప్రయాణించే మార్గంలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని సిబ్బందితోపాటు అధికారులను కూడా దళారులు మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మార్గంలో ఉన్న ప్రతీ పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.50 వేలు చొప్పున మామూళ్లు అందజేస్తున్నారంటున్నారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు కార్పొరేటర్లుగా ఉన్న కొందరికి, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉండే స్థానిక నేతలు, కార్పొరేటర్లకు కూడా నెలావారీ మామూళ్లు ముట్టజెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు టన్నుల రేషన్ బియ్యంతో మిల్లుకు వెళుతున్న వాహనాన్ని స్థానికులు కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించినా, కేసు నమోదుచేయకుండా రెండు రోజులు తాత్సారం చేశారనే ఆరోపణలు వచ్చాయి. చివరకు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదుచేసినట్టు పోలీసులు ప్రకటించారనే ప్రచారం జరిగింది. మిల్లులకు చేరిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు కొద్దిగా పాలిష్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి లెవీ కింద అప్పగించేస్తున్నారు. దీనివల్ల మిల్లర్లకు పెద్దగా ఖర్చు, శ్రమ లేకుండానే కిలోకు రూ.పది వరకు మిగులుతోంది. రేషన్‌బియ్యం మాఫియాపై పోలీసులు, విజిలెన్స్ అధికారులతోపాటు పౌర సరఫరాల శాఖ అధికారులు ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

73 చోరీ కేసుల్లో 103 మంది నిందితుల అరెస్టు

రూ.93.21 లక్షల సొత్తు స్వాధీనం



పోగొట్టుకున్నవారికి చోరీ సొత్తు అప్పగిస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన చోరీ కేసుల్లో 73 కేసులను ఛేదించి 103 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 109 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో దోపిడీ మూడు, పగటిపూట ఇళ్లలో చోరీలు మూడు, రాత్రి పూట చోరీలు 15, గొలుసు అపహరణలు నాలుగు, మోటార్‌సైకిళ్ల చోరీలు 13 కాగా మిగిలినవి ఇతర కేసులు ఉన్నాయన్నారు. వీటితోపాటు రూ.60 లక్షల విలువచేసే 419 మొబైల్ ఫోన్‌లను కూడా రికవరీ చేశామన్నారు. నిందితుల నుంచి 660 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి, రూ.2.73 లక్షల నగదు, 14 మోటార్ సైకిళ్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, లారీ బ్యాటరీలు రెండింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రికవరీ సొత్తును హక్కుదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ లతామాధురి, క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

» జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టణ భూగరిష్ఠ పరిమితి (అర్బన్ ల్యాండ్ సీలింగ్) చట్టం పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూముల క్రమబద్ధీకరణకు 2023, ఫిబ్రవరి 24న జారీ చేసిన జీవో 84 మేరకు అదే సంవత్సరం డిసెంబరు 31లోగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇదే జీవోను కొనసాగిస్తూ ఈ ఏడాది జనవరి 27న జీవో నంబరు. 27 జారీ చేశారన్నారు. దీని ప్రకారం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టానికి లోబడి దరఖాస్తు చేసుకునే ఆక్రమణదారులు 2019, మే ఒకటో తేదీ నాటికి సదరు భూమి ఆక్రమణలో ఉన్నట్టుగా రిజిస్టర్ డాక్యుమెంట్, జీవీఎంసీ నుంచి ప్లాన్, ఇంటి పన్ను రశీదు, నీటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు నకళ్లతో ఈ ఏడాది డిసెంబరు 31లోగా సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల వరకు ఉచితంగా పట్టా అందజేస్తారని, 151 గజాల నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువకి 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాల దాటినవారు 100 శాతం విలువ లెక్కించి, అందులో మొదటి విడతగా 50 శాతం నగదుకు 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాంగ్ సీలింగ్' పేరిట డీడీ / బ్యాంకర్ చెక్‌ను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'వైసీపీ కృత్రిమ ఉద్యమాలు మానుకోవాలి'

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు కొనసాగించాలని వైసీపీ నాయకులు చేస్తున్న కృత్రిమ ఉద్యమాలు మానుకోవాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఇవ్వాలే తప్ప ఇలాంటి ఉద్యమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేని మీరు ప్రశ్నించడానికి అర్హులు కాదన్నారు.

ఈకేవైసీకి డెడ్‌లైన్

... 5వ పేజీ తరువాయి

వాహనాలు ఖాళీగా ఉంటున్నందున వారి సేవలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. అంతే తప్ప పూర్తిగా డీలర్లకు బాధ్యతలు అప్పగిస్తే ఈకేవైసీ పూర్తిచేయడం సాధ్యం కాదని స్పష్టంచేస్తున్నారు. బియ్యం కార్డులో పేరు కలిగిన ఆరు నుంచి 60 సంవత్సరాల వయస్సు గల సభ్యులంతా ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని ఇన్‌చార్జి డీఎస్‌వో కల్యాణి తెలిపారు. తమ సమీపంలో ఉన్న రేషన్ డిపో వద్దకు వెళ్లి ఈపోస్ మిషన్‌లో వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తిచేయాలని, వివరాలకు అందుబాటులో ఉన్న సచివాలయాలు, తహసీల్దార్/సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రతించాలన్నారు. ఈ ప్రక్రియ మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు.

29న జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమవడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 29న ఏర్పాటుచేయాలని జీవీఎంసీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో సమావేశానికి హాజరుకావాలని నోటీసుతోపాటు బడ్జెట్ ముసాయిదా ప్రతులను గురువారం కార్పొరేటర్లందరికీ అందజేశారు. 29వ తేదీ నాటికి కొత్త కమిషనర్‌ను నియమిస్తే ఆయన ఆధ్వర్యంలోనే బడ్జెట్ సమావేశం జరుగుతుందని, ఎవరినీ నియమించకపోతే ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ హాజరవుతారని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో మళ్లీ తప్పులే

... 5వ పేజీ తరువాయి

సంఘ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా గురువారం అందుబాటులో ఉంచిన జాబితాపై ఈనెల 24వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నారు. పదో తరగతి ఇన్విజిలేషన్ విధులు కాదని అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి విశాఖ వచ్చి అభ్యంతరాలు ఎలా ఇస్తారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు ఇచ్చే ప్రక్రియ ఎందుకు చేపట్టరని అంటున్నారు. తొలుత అభ్యంతరాలు ఆన్‌లైన్‌లో తీసుకుని తరువాత సంబంధిత టీచర్ నుంచి వివరణ తీసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు.

వైసీపీకి ఆరుగురు కార్పొరేటర్లు గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే కూటమి బలం 66కి పెరుగుతుంది. వీరుకాకుండా ఎక్స్ అఫీషియో సభ్యులుగా కూటమికి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 11 మంది ఉన్నారు. వారితో కలిపితే కౌన్సిల్‌లో కూటమికి 77 మంది బలం ఉన్నట్టవుతుంది. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యులు బలం అవసరం.

రాజీవ్ స్వగృహ భూమి డీ నోటిపై

... 5వ పేజీ తరువాయి

సాధారణ ఎన్నికలకు ముందు ఈ-వేలం నిర్వహించింది. అప్‌సెట్ ధర గజం రూ.60 వేలుగా నిర్ణయించగా, వాటిలో సగం ప్లాట్లు గజం రూ.60,500 చొప్పున పలువురు పాడుకున్నారు. వాటి ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. అయితే ఆ భూమి నెల రోజుల క్రితం వరకు 22-ఏలోనే ఉంది. ఆ ప్లాట్లు కొనుక్కున్న వారు రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా అడిగితే కార్పొరేషన్ అధికారులు తెల్లముఖం వేశారు. అది ప్రభుత్వ భూమిగా ఇంకా రికార్డుల్లో ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేయలేకపోయారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దాంతో ప్రభుత్వం అన్నీ పరిశీలించి వాటిని 22-ఏ నుంచి తప్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

త్వరలోనే రిజిస్ట్రేషన్లు

రాజీవ్ స్వగృహలో ప్లాట్లు కొనుక్కున్న వారిలో పూర్తి మొత్తం చెల్లించిన వారందరికీ వీలైనంత త్వరగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తామని హౌసింగ్ అధికారి సుబ్బరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అక్కడ ఇంకా 39 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం కొత్తగా నిర్ణయించిన ధర గజం రూ.75,560 చొప్పున అప్‌సెట్ ధర నిర్ణయించి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఈ-కొనుగోళ్ల పోర్టల్ ద్వారా వేలం నిర్వహిస్తామన్నారు.

మధురవాడలో రెండో సబ్ రిజిస్ట్రార్ పోస్టు రద్దు?

... 5వ పేజీ తరువాయి

రోహణ్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై మధురవాడలో జాయింట్ -2గా వేశారు. ఈ డిప్యుటేషన్ 2025 మార్చి 31 వరకు మాత్రమేనని అప్పుడే స్పష్టంచేశారు. పెదగంట్యాడలో పెద్దగా లావాదేవీలు లేని కారణంగా డీఐజీ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై నియమించారు. అయితే ఇటీవల కాలంలో విశాఖలో రియల్ ఎస్టేట్ లావాదేవీలు బాగా తగ్గిపోవడం, ముఖ్యంగా పరిపాలనా రాజధాని వస్తుందని ప్రచారం జరిగిన మధురవాడ ప్రాంతంలో పెద్దగా కార్యకలాపాలు సాగకపోవడంతో అక్కడ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టును ఈ నెలాఖరు తరువాత కొనసాగించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. అక్కడ పనిచేస్తున్న రోహణ్‌కుమార్‌ను తిరిగి పెదగంట్యాడ పంపాలని భావిస్తున్నారు. పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ దీప్తి ప్రియ ఇటీవల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అక్కడ కూడా మూడు నెలలు సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయం నడిపించారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడం, లక్ష్యాలు పూర్తిచేయాల్సిన అవసరం ఉండడంతో ఆమె ఇటీవలె తిరిగి విధుల్లో చేరారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అన్ని కార్యాలయాలను డిప్యుటేషన్లు లేకుండా పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్లతో నడపనున్నారు.

ఆనందపురం జంక్షన్‌ను అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రికి ఎంపీ శ్రీభరత్ లేఖ



కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ అందజేస్తున్న శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఆనందపురం జంక్షన్ ట్రాఫిక్ సమస్యల కేంద్రంగా మారిందని, దీనిని అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని విశాఖ ఎంపీ శ్రీభరత్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రిని ఆయన కలిసి ఓ లేఖను అందజేశారు. విశాఖ నుంచి వెళ్లే వాహనాలను... ముఖ్యంగా ఆర్టీసీ బస్సులను ఆనందపురం జంక్షన్‌లో పూల వ్యాపారుల కోసం ఆపుతున్నారని పేర్కొన్నారు. అక్కడ జంక్షన్ మధ్యలో భారీ ఐల్యాండ్ ఉందని, దానిని తొలగించి లెవెలింగ్ చేస్తే చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టవలసిందిగా కోరారు.

శ్రీనగర్‌లో భారీ చోరీ

- 15 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్‌లో భారీ చోరీ జరిగింది. సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు అపరహణకు గురయ్యాయి. గాజువాక క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో టి.నాగలక్ష్మి అనే మహిళ ఒకరే ఉంటున్నారు. బుధవారం రాత్రి ఓ వివాహానికి ఆమె హాజరై తిరిగి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చారు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో అనుమానంతో చూడగా, లోపల ఉంచిన 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో నాగలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి వెనక తలుపును విరగ్గొట్టి దొంగలు చొరబడినట్టు పోలీసులు గుర్తించారు. కాగా బీరువాకు తాళాలు వేసి దానికే వదిలివేసినట్టు పోలీసులు పేర్కొన్నా రు. సంఘటనా స్థలాన్ని క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ కె.శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **రాజుగారి దొంగలు :** శ్రీకన్య-2 (గాజువాక)
- **శబ్దం :** సంగం,శారద, సౌజన్య (గోపాలపట్నం),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం),తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 38, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 20, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్యరపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఆరుబయట చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ 11వ వార్డు పారిశుధ్య సిబ్బంది వినూత్న ప్రణాళిక



చెత్త తరలించిన చోట ముగ్గులు వేసి పూల కుండీలు ఏర్పాటు చేసిన దృశ్యం



చెత్త వేస్తే రూ.వెయ్యి జరినామా వేస్తామంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆరిలోవ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ స్థలాల్లో చెత్తలు వేస్తే ఆ ప్రాంతమంతా దుర్గం ధపూరితంగా మారి ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతాయని, దీనివల్ల అనేక వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి పాలవుతారంటూ జీవీఎం సీ శానిటరీ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నా.రు. ప్రతి ఒక్కరిలో మార్పురావాలి. ఈ మార్పు వచ్చినపుడు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. జీవీఎంసీ 11వ వార్డులో గల కొన్ని ప్రాంతాల్లో స్థానికులు వేసిన చెత్తను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో తొలగించారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంతమంతా ముగ్గులు వేసి పరిశుభ్రం చేశారు. అక్కడ పూల మొక్కలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేసి 'ఇక్కడ చెత్త వేసిన వారు రూ.1000 జరిమాన చెల్లించవలసి ఉంటుంది' అని హెచ్చరిక జారీ చేశారు. మీ ఇంటిలో చెత్తను మీ ఇంటికి వచ్చే జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందించి పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. స్థానికంగా ఈ ఫ్లెక్సీ అందరినీ ఆకట్టుకుంటోంది.

అబుల్ కలాం ఆజాద్ ట్రస్టు ఆధ్వర్యంలో పిచ్చుకలకు ఆహార బాక్సులు ఏర్పాటు



చెట్లకు ఆహార బాక్సలను ఏర్పాటు చేస్తున్న ట్రస్టు సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం)లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ట్రస్టు ఆధ్వర్యంలో చెట్లకు పిచ్చుకల ఆహార బాక్సలు, నీళ్ల కోసం మట్టి సాసర్‌లను గురువారం అమర్చారు. ఏయూ ఉన్నతపాఠశాలతో కలిసి ట్రస్టు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.నాగరాజకుమారి మాట్లాడుతూ ఎండలు అధికమవుతున్న ఈ సమయంలో మూగజీవులకు ఆహారం, నీరు అందిస్తున్న ట్రస్టు సేవలు అభినందనీయం అన్నారు. ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఖాజారహరుతుల్లాను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు నగరంలోని ఎన్జీవోలు స్ఫూర్తిగా తీసుకుని వివిధ ప్రదేశాలలో అమర్చాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టు ఛైర్మన్ మాట్లాడుతూ సెల్‌టవర్ల రేడియేషన్ వలన ఊర పిచ్చుకలు నానాటికీ నశించిపోతున్నాయని, ఈ విషయంలో పర్యావరణవేత్తలు సామాజిక వేత్తలు తగు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

కంబాలకొండ పార్కులో నీటి తొట్టెల ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన నీటి తెట్టెలు

ఆరిలోవ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కంబాలకొండ నేచరల్ పార్కులో జంతువులు దాహార్తిని తీర్చుకోవడానికి నీటి తొట్టిలను ఏర్పాటు చేసినట్టు రేంజర్ శాస్త్రి తెలిపారు. వేసవి కారణంగా జంతువులు తాగునీటికి ఇబ్బందులకు ఎదురవకుండా ఉండేందుకు ఈ పార్కులో సుమారు 15 వరకు నీటి తొట్టిలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు ఈ నీటి తొట్టెలలో నీరు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఖాళీ చేసి మళ్లీ కొత్తగా నీరు నింపనున్నట్టు చెప్పారు. అలాగే జంతువులకు ఎటువంటి అనారోగ్యం కలగకుండా ఉండేందుకు అక్కడ అక్కడ అక్కడ ఉప్పు గడ్డలను కూడా చెట్లకు కడుతున్నట్టు తెలిపారు, జంతువులు తమ నాలుకతో వాటిని గీకు తాయని తెలిపారు. ఈ అడవులలో జింకలతో పాటు అడివి కుక్కలు, అడవి పందులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇంతవరకు ఈ పార్కులో చిరుతల జాడ లేదని ఆయన తెలిపారు.

పిచ్చుకల పరిరక్షణ అందరి బాధ్యత

- జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ



నీటి తొట్టెలు, వరి కంకులు ఏర్పాటు చేస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ, గ్రీన్ క్లైమెట్ ప్రతినిధులు జేవీ రత్నం, ఏయూ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పిచ్చుకలను పరిరక్షించే క్షోబాధ్యత అందరిదీ అని జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. లాసన్స్‌బే కాలనీలోని శాంతి ఆశ్రమంలో గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి సత్యన్నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆశ్రమంలో పిచ్చుకల కోసం గూళ్లు, నీటి కోసం పాత్రలు, ధాన్యం కుచ్చులను స్వచ్ఛంద సంస్థ అందచేసింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమం ప్రతినిధి ఆదిత్య, జనసేన నాయకులు పి.ఆదినారాయణ, వనమాలి ప్రతినిధి రమాదేవి, ఏయూ సోషల్ వర్క్స్ విద్యార్థులు కేదాత్రి, నిఖిత, భానుప్రసాద్, వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం తనిఖీలు



మంచినీటి కుళాయిని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దువ్వాడ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్‌ఎం లలిత్ బొహ్రా గురువారం తనిఖీలు చేశారు. ముందుగా దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల మౌలిక సదుపాయాలు, స్టేషన్ అభివృద్ధి, యార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అక్కడ నుంచి పర్లాకిమిడి స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలలో భాగంగా వెయిటింగ్ హాల్స్, పాదచారుల వంతెన, రైల్వే కార్యాలయాల నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ నుంచి నౌపడ స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకంలో భాగంగా స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించండి

జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు



ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లలో ఆటలాడడం ఆత్మహత్యలకు దారితీస్తాయని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు చెప్పారు. మద్దిలపాలెంలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ఆయన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఎంత ప్రమాదకరమో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఊబిలో పడి 1500 మందికి పైగా యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, నాయకులు దేవర శంకర్, హరికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

- శ్రామిక్ యూనియన్ ఆరోపణ
- వైద్యుల తీరుపై హైపవర్ కమిటీ విచారణకు డీఆర్‌ఎం ఆదేశం



రైల్వే ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల చిన్నారి మృతికి వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో వైద్యులు కారణమని ఆరోపిస్తూ తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ యూనియన్ గురువారం ఆందోళన చేపట్టింది. అనారోగ్యంలో ఆసుపత్రికి వచ్చిన చిన్నారికి అత్యవసర వైద్య సేవలందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ శాఖలో ట్రాక్‌మన్ శ్రీనివాసరావు అనే ఉద్యోగి కుమార్తె అన్విక (3) బుధవారం ఉదయం అస్వస్థతకు గురైంది. వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్న అన్వికను రైల్వే ప్రధాన ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర సేవలందించాలని విన్నవించినా ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోకుండా అవుట్ పేషెంట్ (ఓపీ)లో చూపించిన తర్వాతే మిగిలిన చికిత్స జరుగుతుందంటూ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. గంటల తరబడి ఓపీలో పడిగాపులు తర్వాత వైద్యులు తనిఖీ చేసి వెంటనే క్యాజువాల్టీ వార్డులో జాయిన్ చేయాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లిన తర్వాత చిన్నారికి ఇంజక్షన్, సెలైన్ బాటిల్స్ పెట్టి పర్యవేక్షణలో ఉంచారు. తర్వాత ఎలాంటి చికిత్స చేయకపోవడంతో గురువారం వేకువజామున అన్విక ఆరోగ్య పరిస్థితి విషమించింది.చిన్నారిలో ఎలాంటి చలనం లేకపోవడమే కాకుండా పల్స్ పడిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. మెడికవర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చిన్నారి మృతి చెందినట్టు గుర్తించిన తల్లిదండ్రులు ఆర్తనాదాలతో తిరిగి రైల్వే ఆస్పత్రికి వచ్చి వైద్యుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న శ్రామిక్ యూనియన్ నాయకులు వెంటనే అక్కడకు చేరుకుని చిన్నారి అన్వికకు జరిగిన అన్యాయం, వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా యూనియన్ నాయకులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. దీనిపై అత్యున్నత కమిటీ (హైపవర్) విచారణ చేపట్టి చిన్నారి మృతికి కారకులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

22న జిల్లెళ్లమూడి అమ్మవారి ఆలయ రజతోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ నిర్వాహకులు కుసుమచక్రవర్తి తదితరులు

పెదవాల్తేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో వెలసిన శ్రీజిల్లెళ్లమూడి అమ్మవారి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు కుసుమ చక్రవర్తి తెలిపారు. గురువారం పెదవాల్తేరులోని శ్రీజిల్లెళ్లమూడి అమ్మవారి ఆలయం అవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆలయం స్థాపించి ఈ నెల 22వ తేదీకి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మార్చి 23వ తేది ఆదివారం సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారనితెలిపారు. మాతృశ్రీ అధ్యయన పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో కన్వీనర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ అతుకూరి వెంకటేశ్వర యోగి, సహ-కన్వీనర్‌గా ఎమ్మెస్ శరశ్చంద్ర కుమార్ తదితరులు పాల్గొననున్నట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించే అవకాశం రావడం లేదు

- అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దేశ్‌పాండే



సమావేశంలో మాట్లాడుతున్న దేశ్‌పాండే, సమాఖ్య నేతలు

సిరిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా మూడు లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో నేరుగా చర్చించే అవకాశం రావడం లేదని అఖిలభారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు దేశ్‌పాండే ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హోటల్ మేఘలయాలో విశాఖపట్నం జిల్లా బ్యాంకు విశ్రాంత సమాఖ్య ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై యుఎఫ్‌బీయూతో చర్చించినా, వారు బ్యాంకుల్లో పని చేస్తున్న వారిపైనే శ్రద్ధ చూపుతున్నారని, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మాత్రం శ్రద్ధ పెట్టడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ జరగనప్పుడు, విశ్రాంత ఉద్యోగులకు మూల వేతనం ఆధారంగా పెన్షన్ సవరణ చేస్తున్నారన్నారు. 1986 నుంచి బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ విధానం అమలు చేస్తున్నప్పటికీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ జరగడం లేదన్నారు. కాబట్టి సమస్యలపై సంఘటితంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పీవీ రమణకుమార్, తెలంగాణ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'

వెంకోజీపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): యువతరం పారిశ్రామికవేత్తలు ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం తన కార్యాలయంలో హెచ్‌ఆర్‌ఎం విద్యార్థులను అభినందించారు. ఇటీవల ప్రాంగణ నియామకాల్లో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ సంస్థలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

దర్జాగా ప్రభుత్వ స్థలంలో నివాసం

- గోశాల నిర్వాహణ
- ఫిర్యాదు చేసినా స్పందించని జీవీఎంసీ అధికారులు



ప్రభుత్వ స్థలం ఆక్రమించి వేసిన రేకుల షెడ్డు

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై చిన్న తోపుడు బండి పెట్టి చిరువ్యాపారం చేసుకుంటేనే చూస్తూ ఊరుకోని పట్టణ ప్రణాళిక అధికారులకు సుమారు 50 గజాల రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలంలో దర్జాగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు ఏడాదికి పైగా ఓ కుటుంబం ఇక్కడ నివాసముంటున్నా పట్టణ ప్రణాళిక అధికారులకు ఎందుకు కానరావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది చాలదన్నట్టు పక్కనున్న ఆలయ అర్చకులు నివాస షెడ్డుకు తోడుగా గోశాలను నిర్వహిస్తున్నారు. ఇదీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ శివాలయం వద్దనున్న ప్రభుత్వ స్థలం దుస్థితి. తొలుత ఈ కుటుంబం వారు ఇక్కడున్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలంలో అక్రమంగా నివాసం ఉండేవారు. స్థలాలన్నీ వేలంపాటలో విక్రయించిన తరువాత స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి ఖాళీ చేయించారు. దీంతో ఈ కుటుంబీకులు శివాలయం గోడకు ఆనుకుని ఉన్న విలువైన స్థలంలో ఓ రేకుల షెడ్డును వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ విషయమై 2023, జూలై 17న ఆలయ అర్చకులు ఒకరు జీవీఎంసీలో ఫిర్యాదు చేయగా, సమస్యను పరిష్కరించకుండానే అదే ఏడాది డిసెంబరులో సమస్య పరిష్కరించాం అని స్పందన రిప్లై లేఖను ఫిర్యాదుదారుడికి పంపించారు. అయితే ఇప్పటి వరకుకూ ఆక్రమణను ఎవరూ అడ్డుకునే వారే లేరు.

కాగా ఈ షెడ్డులో నివాసముంటున్న వారు అసాంఘిక కార్యకలాపాలను కూడా నిర్వహిస్తున్నారని మరికొంతమంది ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయమై స్పందించి ఆక్రమణను తొలగించి, విలువైన స్థలాన్ని పరిరక్షించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏప్రిల్ 4 నుంచి కరకచెట్టు పోలమాంబ వార్షికోత్సవాలు

- ఆలయ కార్యనిర్వహణాధికారి గాయత్రి



పెదవాల్తేరు, మార్చి 20 :(ఆంధ్రజ్యోతి) స్థానిక పెదవాల్తేరులో వెలసిన శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి మే 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాయత్రి తెలిపారు. అమ్మవారిని 14 గ్రామాల ప్రజలు ఆరాధిస్తారని చెప్పారు. వార్షిక జాతర మహోత్సవం పురష్కరించుకుని గురువారం పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో వివిధ విభాగాల అధికారులతో సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్ అధ్యక్షతన సయన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో గాయిత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 4 నుంచి మే 6వ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4న పందిరి రాట మహోత్సవం, 6న పండుగ చాటింపు, 7న అమ్మవారి దేవర పండగ (పుట్టబంగారం తెచ్చుట) 14న తొలేళ్లపండగ, 15న అనుపు ఉత్సవం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 22న మారువారం పండగ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఏప్రిల్ 26న మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. పండుగ నేపథ్యంలో దేవస్థానంలో సకల ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టి. అన్నపూర్ణ, 3 టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ, ట్రాఫిక్ సీఐ, గ్రామ సేవ సంఘం సభ్యులు, జీవీఎంసీ, ఫైర్, ఫుడ్ హెల్త్, శ్రీహరి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సీనియార్టీ జాబితాలో అభ్యంతరాలపై 24 వరకు అవకాశం : డీఈవో

ఆరిలోవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియార్టి జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని ఈ నెల 24లోగా జిల్లా విద్యాశాకాదికారి కార్యాలయానికి సమర్పించాలని జిల్లా విద్యాశాకాదికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు పాఠశాల విద్యాశాఖ పరిదిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు, సాధారణ సీనియారిటీ జాబితాను మొదటి జాబితాలో గల అభ్యంతరాలు పరిష్కరించినట్టు చెప్పారు. వాటిని విశాఖ జిల్లా విద్యా శాఖ వెబ్ సైట్‌లోనూ, కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్టు ఈడీవో తెలిపారు.

అందజేయాల్సిన వివరాలు

అభ్యంతరాల కోసం సదరు ఉపాధ్యాయుడు/ ఉపాధ్యాయురాలి పూర్తి పేరు, ఎక్కడ పని చేస్తున్నాడో అందుకు సంబంధింధిన వివరాలు, ఈఎంపీ ఐడీ తెలియ జేయాలన్నారు. సీనియారిటి జాబితాలో ఎక్కడ తప్పిదం జరిగిందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు లేదా సంబంధిత ఆధారాలు తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఆధారాలు సమర్పిస్తేనే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ లోగా సమర్పించాలన్నారు. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీ అభ్యంతరాలు పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని సంబందిత ప్రధానోపాద్యాయుల/ ఉపాధ్యాయురాలికి తెలియజేస్తుందని డీఈవో పేర్కొన్నారు.

కాలియోగ్రఫీ శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేత



ధ్రువపత్రాలు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ ఖాజారహమతుల్లా

వెంకోజీపాలెం, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : గత నెల నుంచి మౌలానా అబ్దుల్ కలాం ట్రస్టు ప్రతినిధులకు ఏయూ పాఠశాల విద్యార్థులకు కాలియోగ్రఫీలో శిక్షణ కోర్సు నిర్వహించి గురువారం విద్యార్థులకు అర్హత పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిక్షకుడు ఎర్రాజీరెడ్డిని దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సులోమి, సీనియర్ ఉపాధ్యాయిని డాక్టర్ దయాపాక్షి ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఖాజారహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పుస్తకావిష్కరణ

వెంకోజీపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ఏయూలోని భూగర్భశాస్త్ర విభాగంలో "మైనింగ్ భూగర్భశాస్త్ర పద్ధతులు, ఖనిజ నిల్వల అంచనా" అనే పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ్‌రావు హాజరయ్యారు. ఈ పుస్తకాన్ని ఎన్ఎండీసీ లిమిటెడ్ సంస్థలోని భూగర్భశాస్త్ర విభాగం మాజీ అధికారి, భూగర్భశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి పీఎస్ఎన్‌మూర్తి రచించారు. ఈ సందర్భంగా భూగర్భశాస్త్ర విభాగం విభాగాధిపతి కెఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశ్రాంత గ్రంథాలయాధికారి జనార్ధనరావు, ప్రధానగ్రంథాలయాధికారి జీఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినతికి సీఎం హామీ



సీఎం చంద్రబాబును కలిసిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పరిష్కారం కాని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తనవంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో సైన్స్ వర్కుషాపు ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్' అనే అంశంపై ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రసాయనిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వర్కుషాపు గురువారం ప్రారంభమైంది. వర్కుషాపును ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ బెంగళూరు ఐఐఎస్‌సీకి చెందిన ప్రొఫెసర్ ఎస్‌నటరాజన్, ప్రొఫెసర్ బాలాజీ జాగీర్దార్‌లు ఉపన్యాసకులుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తొలిరోజ నానో మెటీరియల్స్, ఇనార్గానిక్ మెటీరియల్స్, హైడ్రోజన్ ఇంధన ఉపయోగాలు అనే అంశాలపై ఉపన్యాసాలిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.ఆర్.ప్రసాద్, కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.కళ్యాణరామ్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలల రసాయన శాస్త్ర అధ్యాపకులు, నిపుణులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాష్ ప్రోగ్రాం ద్వారా గురువారం ప్రథమ చికిత్స కిట్ అందజేశారు. ఈ కిట్‌ను ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరసకు ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.రేణుక, ఎఫ్ఎల్ఎన్ టీచర్ డి.ధరణి అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, డి.నిర్మల, ఎ.సునంద్, పి.లలిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి కప్పరాడలో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, మెట్లు నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సహకారంతో కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, గురువోజీ, బీజేపీ నాయకుడు జి.అరుణ్‌బాబు, గుణుపూడి అరుణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి జ్యోతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వార్డు టీడీపీ నాయకురాలు పెంటకోట స్రవంతి గురువారం ప్రారంభించారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని స్థానికులు వార్డు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకురావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే విష్ణుకుమార్ దృష్టికి టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించారు.

శాంతితోనే దేశాభివృద్ధి



నరవకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శాంతితోనే దేశాభివృద్ధి సాధ్యమని విద్యా సామాజిక వేత్త నరవ ప్రకాశరావు అన్నారు. యునైటెడ్ రిలీజియన్స్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో జరిగిన 'శాంతి-అభివృద్ధి' సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశాభివృద్ధిలో మత సామరస్యం అవసరమన్నారు. అందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతి నెలకొల్పడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసాన్ని ఆయన సమర్పించారు. అనంతరం ప్రకాశరావు ప్రసంగాన్ని అభినందిస్తూ యూఆర్ఐ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ అబ్రహం, సౌత్ ఇండియా ఆఫీసర్ మట్టకుట్టీ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

సీతంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాధాకృష్ణ మందిరం ప్రాంతంలో నివాసం ఉంటున్న వంగ విజయలక్ష్మి (52) గురువారం ఉదయం ఇంటి నుంచి కాలినడకన బయలుదేరి సీతంపేట నుంచి గాంధీనగర్‌కి వెళ్లే వైపు జాతీయ రహదారి దాటుతుండగా సత్యం కూడలి నుంచి గురుద్వార కూడలి వైపు వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఢీకొట్టాడు. ఆమె రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమైందని ద్వారకా పోలీసులు తెలిపారు. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాలు, క్షతగాత్రురాలి ఫిర్యాదుతో సీఐ రమణ కేసు విచారణ చేపట్టారు.

జాతర మహోత్సవాలకు శ్రీకారం



పూజా కార్యక్రమాల్లో మాలధారణ వ్యక్తులు, అర్చకులు



రేణుక యల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

మురళీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29 వరకు ఉత్సవాలు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ, అర్చకవర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పూజాదికాలు ఆరంభించినట్లు అర్చకుడు బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ సేవా సంఘం సభ్యులతో అమ్మవారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ చేపట్టారు. భక్తులు, మాలధారణ వ్యక్తుల సమక్షంలో సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, విశేష పుష్పాలంకరణ, దీపారాధన సేవలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు.

గాంధీనగర్‌లో ఉత్సవాలకు ఏర్పాట్లు

కంచరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు గాంధీనగర్‌లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 29న తొలేళ్లు, 30న ప్రధాన పండగ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా



బర్మాక్యాంప్‌లో ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

ముస్తాబు చేస్తున్నారు. అమ్మవారి మాలధారణ భక్తుల పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలేళ్ల ఉత్సవం రోజు అమ్మవారి ఘటాలతో ఊరేగింపు. అగ్నిగుండ ప్రవేశం తదితర ఘట్టాలు ఉంటాయన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

అల్లిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ రామారావు జంక్షన్ అచ్చియ్యమ్మపేట రేణుక యల్లమ్మ 25వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, వైద్యులు కళా వెంకటరావులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ గౌరవ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బి.పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బొడ్డేటి ప్రసాద్, గనగళ్ల సత్య, కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో అంధకారం తొలగింది



పిల్లల పార్కులో వెలిగిన విద్యుత్ దీపాలు



బస్‌బే వద్ద ఇంకా తొలగని చీకట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు వరుసల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్, పిల్లల పార్కుల్లో అంధకారం తొలగిపోయింది. విద్యుత్ దీపాల వెలుగుతో పార్కులు మళ్లీ మెరిసిపోతున్నాయి. గురువారం ఆంధ్రజ్యోతిలో 'అంధకారంలో పార్కులు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి పార్కుల్లో దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పార్కులకు వచ్చిన వాకర్లు, పిల్లలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో లైట్లు వెలిగినా పక్కనే ఉన్న బస్ బే పరిసరాల్లో ఇంకా చీకట్లు తొలగలేదు. అక్కడ ఇంకా అంధకారం రాజ్యమేలుతోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే చాలా మంది ప్రయాణికులు ఈ బస్‌బే వద్ద బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఆ ప్రాంతం చీకటిగా ఉండడం వల్ల ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. చీకటిగా ఉండడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి బస్ బేలోనూ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోగనిరోధక శక్తి పెంపుతోనే వ్యాధుల నివారణ సాధ్యం

మహారాణిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారం తీసుకుంటే శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోచ్చునని ప్రముఖ న్యూట్రీషియన్ కృష్ణస్వామి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు.. రోగనిరోధక శక్తి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక వైరస్‌లు విజృంభించే అవకాశం పొంచి ఉందని, వాటి బారి నుంచి కాపాడుకోవటానికి ఔషధ సేవనం కన్నా ముందు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మనం నిత్యం తీసుకునే పోషక పదార్థాలతో కూడిన ఆహారంతోనే ఇది సాధ్యమని అన్నారు. ఆహారంలో విటమిన్ సి అందించే నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్ష వంటి వాటితో పెరుగుతుందన్నారు. వివిధ రకాల ఆకుకూరలు, వెల్లుల్లి, బాదం వంటి వాటిలో కీలకపాత్ర పోషించే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కలిగి ఉంటాయని తెలిపారు. ప్రస్తుత తరుణంలో రోగనిరోధక శక్తిని అందించే ఆహారాన్ని ప్రతీ ఒక్కరూ స్వీకరించాలని కృష్ణస్వామి సూచించారు.

'కొత్త'గా చెత్త ప్రాంతాలు



నందగిరినగర్‌లో ముగ్గు వేసి మొక్కలు పెట్టిన అధికారులు

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పోగైన చెత్తను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను పాలిథిన్ కవర్లు, కాగితాల్లోచుట్టి రివ్వున విసిరేయడం చాలామందికి అలవాటు. గ్రేటర్ 42, 43 వార్డుల్లో ఇలా ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే ప్రాంతాలను గ్రీన్‌స్పాట్‌గా తీర్చిదిద్దాలని జీవీఎంసీ అధికారులు సంకల్పించారు. స్థానికులకు కనువిప్పు కలిగేలా చెత్త వేస్తున్న ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గు వేశారు. అక్కడ చుట్టూ కొన్ని మొక్కలు పెట్టారు. ఇంటింటికీ వస్తున్న పారిశుధ్య కార్మికులకు చెత్త అందించాలే తప్ప ఎక్కడబడితే అక్కడ వేయరాదని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



గ్రీన్‌పార్కు వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

మహారాణిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు డిమాండ్ చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రీన్‌పార్కు వద్ద ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ స్మార్టు మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లిస్తామన్న హామీని అధికారులు అమలుపరచటం లేదని ఆరోపించారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పనిదినాలు అమలు చేయాలని, 2019 తరువాత వేతనాలు పెంచలేదని తెలిపారు. హామీలు నెరవేర్చి అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అక్రమాలకు సహకారం!

... 5వ పేజీ తరువాయి

ఒక్క ఏడాది కూడా ఎందుకు బయట పెట్టలేదు అన్నదే ఇప్పుడు ప్రశ్న. సుహనీ షాపింగ్ మాల్ ఒప్పందంలో చాలా తప్పులు జరిగాయి. వందల కోట్ల రూపాయల వ్యవహారం కాబట్టి చాలా జాగ్రత్తగా ఆడిట్ చేయాలి. కానీ ఆ దాఖలాలు లేవు. ఒకవేళ అలా చేసి ఉంటే గుర్తించిన తప్పులను డీసీఏఓ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తెలియజేసి ఉండేవారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. అక్కడ ఆడిటింగ్‌కు అనుకూలమైన వారిని పంపడం, ఏ తప్పులు గుర్తించకుండా, అంతా బాగుందని నివేదికలు ఇవ్వడం వంటి పనులు నిరాటంకంగా సాగుతూ వస్తున్నాయి.

పెరుగుతున్న ఖర్చులు గుర్తించలేరా?

సూపర్ బజార్‌కు గతంలో భవన నిర్వహణకు ఏడాదికి రూ.5 లక్షలకు మించి ఖర్చు కాలేదు. ఇప్పటి మేనేజింగ్ డైరెక్టర్ హయాంలో అది రెట్టింపు అయింది. ఆ పేరుతో గత నాలుగేళ్లలో రూ.60 లక్షలు వెచ్చించారు. ఖర్చు ఒక్కసారిగా పెరిగినప్పుడు ప్రశ్నించి, వాటిని నివేదించాల్సిన బాధ్యత ఆడిటర్లది. అలాగే కంటింజెన్సీ ఆఫీసు నిర్వహణ పేరుతో లక్షల రూపాయల ఖర్చు చూపించారు. వాటిని కూడా ఆడిటర్లు వేలెత్తి చూపించలేదు. వీటన్నింటిపై సరైన విచారణ జరిగి, వాస్తవాలు వెలుగులోకి రావాలంటే...ఇప్పుడున్న డీసీఏఓ స్థానంలో విచారణ బాధ్యతలు వేరొకరికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఈ ఐదేళ్లలో సూపర్ బజార్ లెక్కలు ఆడిటింగ్ చేసిందెవరో గుర్తించి, వేరే వారితో మళ్లీ ఆ లెక్కలు ఆడిట్ చేయించాల్సి ఉంది.

రేషన్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్‌తోపాటు టీడీపీకి చెందిన కార్పొరేటర్‌కు, టీడీపీ స్థానిక నాయకుడికి ప్రతి నెలా మామూళ్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు ఆరోపిస్తున్నారు. గాజువాక సర్కిల్‌లో 146 రేషన్ డిపోలు ఉండగా, 1.33 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతి నెలా రెండు వేల టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. వీటిలో సుమారు 500 టన్నులను ఆ నలుగురు దళారీలే ప్రత్యేకంగా మనుషులను నియమించుకుని కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని సబ్బవరం, చోడవరం సమీపంలోని మిల్లులకు రూ.25 కి విక్రయిస్తున్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేలు మామూళ్లు

రేషన్ బియ్యం కొనుగోలు చేసిన దళారులు వాటిని వ్యాన్‌లలో సబ్బవరం సమీపంలోని ఆరిపాక, చోడవరం సమీపంలోని వెంకన్నపాలెంలోని మిల్లులకు తరలిస్తున్నారు. రైస్‌మిల్లుల సంఘంలో కీలకంగా వ్యవహరించే ఒక మిల్లు యజమాని ఏ వాహనం ఏ మిల్లుకు వెళ్లాలో ముందుగానే చెబుతాడు. వాహనం ప్రయాణించే మార్గంలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని సిబ్బందితోపాటు అధికారులను కూడా దళారులు మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మార్గంలో ఉన్న ప్రతీ పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.50 వేలు చొప్పున మామూళ్లు అందజేస్తున్నారంటున్నారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు కార్పొరేటర్లుగా ఉన్న కొందరికి, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉండే స్థానిక నేతలు, కార్పొరేటర్లకు కూడా నెలావారీ మామూళ్లు ముట్టజెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు టన్నుల రేషన్ బియ్యంతో మిల్లుకు వెళుతున్న వాహనాన్ని స్థానికులు కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించినా, కేసు నమోదుచేయకుండా రెండు రోజులు తాత్సారం చేశారనే ఆరోపణలు వచ్చాయి. చివరకు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదుచేసినట్టు పోలీసులు ప్రకటించారనే ప్రచారం జరిగింది. మిల్లులకు చేరిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు కొద్దిగా పాలిష్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి లెవీ కింద అప్పగించేస్తున్నారు. దీనివల్ల మిల్లర్లకు పెద్దగా ఖర్చు, శ్రమ లేకుండానే కిలోకు రూ.పది వరకు మిగులుతోంది. రేషన్‌బియ్యం మాఫియాపై పోలీసులు, విజిలెన్స్ అధికారులతోపాటు పౌర సరఫరాల శాఖ అధికారులు ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

73 చోరీ కేసుల్లో 103 మంది నిందితుల అరెస్టు

రూ.93.21 లక్షల సొత్తు స్వాధీనం



పోగొట్టుకున్నవారికి చోరీ సొత్తు అప్పగిస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన చోరీ కేసుల్లో 73 కేసులను ఛేదించి 103 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 109 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో దోపిడీ మూడు, పగటిపూట ఇళ్లలో చోరీలు మూడు, రాత్రి పూట చోరీలు 15, గొలుసు అపహరణలు నాలుగు, మోటార్‌సైకిళ్ల చోరీలు 13 కాగా మిగిలినవి ఇతర కేసులు ఉన్నాయన్నారు. వీటితోపాటు రూ.60 లక్షల విలువచేసే 419 మొబైల్ ఫోన్‌లను కూడా రికవరీ చేశామన్నారు. నిందితుల నుంచి 660 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి, రూ.2.73 లక్షల నగదు, 14 మోటార్ సైకిళ్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, లారీ బ్యాటరీలు రెండింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రికవరీ సొత్తును హక్కుదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ లతామాధురి, క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

▸▸ జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టణ భూగరిష్ఠ పరిమితి (అర్బన్ ల్యాండ్ సీలింగ్) చట్టం పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూముల క్రమబద్ధీకరణకు 2023, ఫిబ్రవరి 24న జారీ చేసిన జీవో 84 మేరకు అదే సంవత్సరం డిసెంబరు 31లోగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇదే జీవోను కొనసాగిస్తూ ఈ ఏడాది జనవరి 27న జీవో నంబరు. 27 జారీ చేశారన్నారు. దీని ప్రకారం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టానికి లోబడి దరఖాస్తు చేసుకునే ఆక్రమణదారులు 2019, మే ఒకటో తేదీ నాటికి సదరు భూమి ఆక్రమణలో ఉన్నట్టుగా రిజిస్టర్ డాక్యుమెంట్, జీవీఎంసీ నుంచి ప్లాన్, ఇంటి పన్ను రశీదు, నీటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు నకళ్లతో ఈ ఏడాది డిసెంబరు 31లోగా సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల వరకు ఉచితంగా పట్టా అందజేస్తారని, 151 గజాల నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువకి 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాల దాటినవారు 100 శాతం విలువ లెక్కించి, అందులో మొదటి విడతగా 50 శాతం నగదుకు 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాంగ్ సీలింగ్' పేరిట డీడీ / బ్యాంకర్ చెక్‌ను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'వైసీపీ కృత్రిమ ఉద్యమాలు మానుకోవాలి'

అక్కయ్యపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు కొనసాగించాలని వైసీపీ నాయకులు చేస్తున్న కృత్రిమ ఉద్యమాలు మానుకోవాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఇవ్వాలే తప్ప ఇలాంటి ఉద్యమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేని మీరు ప్రశ్నించడానికి అర్హులు కాదన్నారు.

ఈకేవైసీకి డెడ్‌లైన్

... 5వ పేజీ తరువాయి

వాహనాలు ఖాళీగా ఉంటున్నందున వారి సేవలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. అంతే తప్ప పూర్తిగా డీలర్లకు బాధ్యతలు అప్పగిస్తే ఈకేవైసీ పూర్తిచేయడం సాధ్యం కాదని స్పష్టంచేస్తున్నారు. బియ్యం కార్డులో పేరు కలిగిన ఆరు నుంచి 60 సంవత్సరాల వయస్సు గల సభ్యులంతా ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని ఇన్‌చార్జి డీఎస్‌వో కల్యాణి తెలిపారు. తమ సమీపంలో ఉన్న రేషన్ డిపో వద్దకు వెళ్లి ఈపోస్ మిషన్‌లో వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తిచేయాలని, వివరాలకు అందుబాటులో ఉన్న సచివాలయాలు, తహసీల్దార్/సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రతించాలన్నారు. ఈ ప్రక్రియ మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు.

29న జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమవడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 29న ఏర్పాటుచేయాలని జీవీఎంసీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో సమావేశానికి హాజరుకావాలని నోటీసుతోపాటు బడ్జెట్ ముసాయిదా ప్రతులను గురువారం కార్పొరేటర్లందరికీ అందజేశారు. 29వ తేదీ నాటికి కొత్త కమిషనర్‌ను నియమిస్తే ఆయన ఆధ్వర్యంలోనే బడ్జెట్ సమావేశం జరుగుతుందని, ఎవరినీ నియమించకపోతే ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ హాజరవుతారని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో మళ్లీ తప్పులే

... 5వ పేజీ తరువాయి

సంఘ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా గురువారం అందుబాటులో ఉంచిన జాబితాపై ఈనెల 24వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నారు. పదో తరగతి ఇన్విజిలేషన్ విధులు కాదని అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి విశాఖ వచ్చి అభ్యంతరాలు ఎలా ఇస్తారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు ఇచ్చే ప్రక్రియ ఎందుకు చేపట్టరని అంటున్నారు. తొలుత అభ్యంతరాలు ఆన్‌లైన్‌లో తీసుకుని తరువాత సంబంధిత టీచర్ నుంచి వివరణ తీసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు.

వైసీపీకి ఆరుగురు కార్పొరేటర్లు గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే కూటమి బలం 66కి పెరుగుతుంది. వీరుకాకుండా ఎక్స్ అఫీషియో సభ్యులుగా కూటమికి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 11 మంది ఉన్నారు. వారితో కలిపితే కౌన్సిల్‌లో కూటమికి 77 మంది బలం ఉన్నట్టవుతుంది. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యులు బలం అవసరం.

రాజీవ్ స్వగృహ భూమి డీ నోటిపై

... 5వ పేజీ తరువాయి

సాధారణ ఎన్నికలకు ముందు ఈ-వేలం నిర్వహించింది. అప్‌సెట్ ధర గజం రూ.60 వేలుగా నిర్ణయించగా, వాటిలో సగం ప్లాట్లు గజం రూ.60,500 చొప్పున పలువురు పాడుకున్నారు. వాటి ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. అయితే ఆ భూమి నెల రోజుల క్రితం వరకు 22-ఏలోనే ఉంది. ఆ ప్లాట్లు కొనుక్కున్న వారు రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా అడిగితే కార్పొరేషన్ అధికారులు తెల్లముఖం వేశారు. అది ప్రభుత్వ భూమిగా ఇంకా రికార్డుల్లో ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేయలేకపోయారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దాంతో ప్రభుత్వం అన్నీ పరిశీలించి వాటిని 22-ఏ నుంచి తప్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

త్వరలోనే రిజిస్ట్రేషన్లు

రాజీవ్ స్వగృహలో ప్లాట్లు కొనుక్కున్న వారిలో పూర్తి మొత్తం చెల్లించిన వారందరికీ వీలైనంత త్వరగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తామని హౌసింగ్ అధికారి సుబ్బరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అక్కడ ఇంకా 39 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం కొత్తగా నిర్ణయించిన ధర గజం రూ.75,560 చొప్పున అప్‌సెట్ ధర నిర్ణయించి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఈ-కొనుగోళ్ల పోర్టల్ ద్వారా వేలం నిర్వహిస్తామన్నారు.

మధురవాడలో రెండో సబ్ రిజిస్ట్రార్ పోస్టు రద్దు?

... 5వ పేజీ తరువాయి

రోహణ్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై మధురవాడలో జాయింట్ -2గా వేశారు. ఈ డిప్యుటేషన్ 2025 మార్చి 31 వరకు మాత్రమేని అప్పుడే స్పష్టంచేశారు. పెదగంట్యాడలో పెద్దగా లావాదేవీలు లేని కారణంగా డీఐజీ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై నియమించారు. అయితే ఇటీవల కాలంలో విశాఖలో రియల్ ఎస్టేట్ లావాదేవీలు బాగా తగ్గిపోవడం, ముఖ్యంగా పరిపాలనా రాజధాని వస్తుందని ప్రచారం జరిగిన మధురవాడ ప్రాంతంలో పెద్దగా కార్యకలాపాలు సాగకపోవడంతో అక్కడ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టును ఈ నెలాఖరు తరువాత కొనసాగించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. అక్కడ పనిచేస్తున్న రోహణ్‌కుమార్‌ను తిరిగి పెదగంట్యాడ పంపాలని భావిస్తున్నారు. పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ దీప్తి ప్రియ ఇటీవల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అక్కడ కూడా మూడు నెలలు సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయం నడిపించారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడం, లక్ష్యాలు పూర్తిచేయాల్సిన అవసరం ఉండడంతో ఆమె ఇటీవలె తిరిగి విధుల్లో చేరారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అన్ని కార్యాలయాలను డిప్యుటేషన్లు లేకుండా పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్లతో నడపనున్నారు.

శ్రీనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారు ఆభరణాల అపహరణ

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్‌లో భారీ చోరీ జరిగింది. సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు అపరహణకు గురయ్యాయి. గాజువాక క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో టి.నాగలక్ష్మి అనే మహిళ ఒకరే ఉంటున్నారు. బుధవారం రాత్రి ఓ వివాహానికి ఆమె హాజరై తిరిగి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చారు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో అనుమానంతో చూడగా, లోపల ఉంచిన 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో నాగలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి వెనక తలుపును విరగ్గొట్టి దొంగలు చొరబడినట్టు పోలీసులు గుర్తించారు. కాగా బీరువాకు తాళాలు వేసి దానికే వదిలివేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ కె.శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లవద్దు: 'కరణంరెడ్డి'

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల జీవితాలు నాశనమవుతాయని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల వాటిల్లే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది సెలబ్రెటీల ప్రచారంతో సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో యువత ముందుకు వెళుతుండడం బాధాకరమన్నారు. కష్టపడకుండా నగదు సులువుగా రాదని, ఈజీగా నగదు సంపాదించాలనే ఆశను యువత విడనాడాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కలిగే నష్టాలపై గాజువాకలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం, సింహాచలం సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సింహాచలం అప్ హిల్స్, అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్, పంచాయతీ కాలనీ, సమతా కాలనీ, గోశాల జంక్షన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

సినిమా గైడ్

● **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
● **రాజుగారి దొంగలు :** శ్రీకన్య-2 (గాజువాక)
● **శబ్దం :** సంగం, శారద, సౌజన్య (గోపాలపట్నం),
● **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (వరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 38, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 14, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 20, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఆస్తి పన్ను బకాయిదారులపై కొరడా

» ఇప్పటివరకు 63 శాతం మాత్రమే వసూలు
» 17,300 మందికి జప్తు నోటీసులు
» 4,423 మంది ఇళ్లకు కొళాయి కనెక్షన్ల కట్
» నెలాఖరులోగా శత శాతం పన్నుల వసూళ్లపై జీవీఎంసీ జోన్ అధికారుల దృష్టి

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై జీవీఎంసీ కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రధానంగా జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో 63 శాతం మాత్రమే పన్నులు వసూలు కావడంతో శత శాతం వసూళ్లపై అధికారులు దృష్టిసారించారు. జోన్ పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించి రూ.లక్షా 17,213 అసెస్‌మెంట్లు ఉండగా... తద్వారా ఏడాదికి రూ.83 కోట్ల 80 లక్షల 77,738 వసూలు కావాల్సి ఉంది. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.54 కోట్ల 31 లక్షల 94,078 మాత్రమే వసూలైంది. ఇంకా రూ.29 కోట్ల 48 లక్షల 83,660 వసూలు కావాల్సి ఉంది. నీటి పన్నుకు సంబంధించి 58,028 అసెస్‌మెంట్లు ఉండగా ఏడాదికి రూ.21 కోట్ల 32 లక్షల 32,228 వసూలు కావాల్సి ఉండగా, రూ.24 కోట్ల 67 లక్షల 3,056 వసులవ్వగా, ఇంగా రూ.18 కోట్ల 85 లక్షల 59,172 రావాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికి ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అప్పట్లోగా శత శాతం పన్నులను వసూలు చేసే దిశగా అధికారులు చర్యలు చేట్టారు. ఇందుకోసం జోన్ పరిధిలో 106 బృందాలను రంగంలోకి దింపారు. వీరితో పాటు జోనల్ కమిషనర్ శేషాద్రి, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ రామ్‌నారాయణ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. మొండిబకాయిదారుల ఇళ్లకు ఆర్ఐలు శివ, రెడ్డిమోహన్‌లతో కలిసి వెళుతూ పన్నులను వసూలు చేస్తున్నారు. ప్రధానంగా రూ.లక్షల్లో పన్నులు చెల్లించాల్సిన పరిశ్రమల నుంచి బకాయిలను వసూలు చేయడంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు.



నీటి పన్ను చెల్లించని ఓ వ్యక్తి ఇంటి కొళాయి కనెక్షన్‌ను కట్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

17,300 మందికి జప్తు నోటీసులు

ఆస్తి పన్ను చెల్లించని 17,300 మంది మొండి బకాయిదారులకు జప్తు నోటీసులను అధికారులు జారీ చేస్తున్నారు. మూడు రోజుల్లో పన్ను చెల్లించకుంటే ఆస్తులను సీజ్ చేస్తామని అసెస్‌మెంటుదారులకు సంబంధిత సిబ్బంది హెచ్చరిస్తున్నారు. అలాగే 4,423 మంది అసెస్‌మెంటుదారుల ఇళ్లకు కొళాయి కనెక్షన్లకు కట్ చేశారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

-జోనల్ కమిషనర్ శేషాద్రి



ఆస్తి, నీటి పన్నులను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా చెల్లించి జీవీఎంసీ అభివృద్ధికి సహకరించాలని జోనల్ కమిషనర్ శేషాద్రి కోరారు. రూ.కోట్లలో బకాయిలు ఉండడం వల్ల వార్డుల పరిధిలో జరగనున్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఇబ్బందులు ఉంటాయన్నారు. ప్రజలందరూ సహకరిస్తే జీవీఎంసీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బాలికలందరూ పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

« జిల్లా 8వ అదనపు జడ్జి ఎస్.కవిత

పెదగంట్యాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలికలందరూ పోక్సో చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా 8వ అదనపు జడ్జి ఎస్.కవిత అన్నారు. గాజువాక లీగల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు, యువతులు, బాలికలపై అరాచకాలు, వేధింపులు, దాడులతో పాటు హత్యలు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితులు, సామాజిక సమస్యలు, అవగాహన లోపం.. ఇలా ఎన్నో కారణాల వల్ల మహిళలు, బాలికలు నష్టపోతున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల బాలికలు, మహిళల రక్షణ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అరాచక శక్తుల ఆటకట్టించడంలో, చట్టాలను కఠినంగా అమలు చేయడంలోనూ ప్రభుత్వాలతో పాటు కోర్టులు, న్యాయ వ్యవస్థ మరింత ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎంఈవో ఈ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ముందుకు వచ్చి సమాజంలో మార్పును తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.మాలతి, ఉపాధ్యాయుడు రాజారావు, సోషల్ వర్కర్ వినోద్ బాలు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.



గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి కవిత

సమష్టి కృషితో అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

సింహాచల దేవస్థానం ఈవో సుబ్బారావు

సింహాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమష్టి కృషితో ఏప్రిల్ 8న సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాన్ని విజయవంతం చేస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు అన్నారు. కల్యాణోత్సవం నిర్వహణ, గత అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం సింహగిరి అనందనిలయం కాటేజీలో ఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉగాది రోజున పందిరిరాట ఉడుపుతో వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతామని ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు చెప్పారు. ఏప్రిల్ 8న రాత్రి 8 గంటలకు సింహగిరి మాడవీధుల్లో రథోత్సవం, రాత్రి 10.30 గంటలకు వార్షిక తిరుకల్యాణం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో ఈవో చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అనుసరించాల్సిన విధివిధానాలపై నార్త్ ఏసీపీ పృధ్వీరాజ్ తదితర అధికారులతో చర్చించారు. సమావేశంలో పోలీసు, వైద్యం, విద్యుత్, అగ్నిమాపక, జీవీఎంసీ, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు పాల్గొని గత అనుభవాలను, వాటిని అధిగమించి కల్యాణోత్సవం విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ సుబ్బారావు

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

» శ్రామిక్ యూనియన్ ఆరోపణ
» హైపవర్ కమిటీ విచారణకు డీఆర్ఎం ఆదేశం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారి మృతికి వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో వైద్యులు కారణమని ఆరోపిస్తూ తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ గురువారం ఆందోళన చేపట్టింది. అనారోగ్యంలో ఆసుపత్రికి వచ్చిన చిన్నారికి అత్యవసర వైద్య సేవలందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖలో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు అనే ఉద్యోగి కుమార్తె అన్విక (3) బుధవారం ఉదయం అస్వస్థతకు గురైంది. వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్న అన్వికను రైల్వే ప్రధాన ఆసుపత్రికి తీసుకొచ్చారు. అత్యవసర సేవలందించాలని విన్నవించినా ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోకుండా అవుట్ పేషెంట్ (ఓపీ)లో చూపించిన తర్వాతే మిగిలిన చికిత్స జరుగుతుందంటూ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. గంటల తరబడి ఓపీలో పడిగాపులు పడిన తర్వాత వైద్యులు తనిఖీ చేసి వెంటనే క్యాజువాల్టీ వార్డులో జాయిన్ చేయాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లిన తర్వాత చిన్నారికి ఇంజక్షన్, సెలైన్ బాటిల్స్ పెట్టి పర్యవేక్షణలో ఉంచారు. తర్వాత ఎలాంటి చికిత్స చేయకపోవడంతో గురువారం వేకువజామున అన్విక ఆరోగ్య పరిస్థితి విషమించింది. చిన్నారిలో ఎలాంటి చలనం లేకపోవడమే కాకుండా పల్స్ పడిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో చిన్నారి మృతి చెందినట్టు గుర్తించిన తల్లిదండ్రులు ఆర్తనాదాలతో తిరిగి రైల్వే ఆసుపత్రికి వచ్చి వైద్యుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న శ్రామిక్ యూనియన్ నాయకులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని చిన్నారి అన్వికకు జరిగిన అన్యాయం, వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా యూనియన్ నాయకులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. దీనిపై అత్యున్నత కమిటీ (హైపవర్) విచారణ చేపట్టి చిన్నారి మృతికి కారకులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



రైల్వే ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం



బాజీ జంక్షన్ సర్వీస్ రోడ్డులో హైట్‌గేజ్ ఏర్పాటు

వేపగుంట/గోపాలపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు నుంచి ఎన్ఏడీ ఫ్లైఓవర్ కిందకు భారీ వాహనాలు ప్రవేశించకుండా ఉండేందుకు వీఎంఆర్డీఏ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా భాగంగా బాజీ జంక్షన్‌లో ఇటీవల ఐరన్‌తో హైట్‌గేజ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనదారులకు ఇబ్బందులు తీరినట్టయింది. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వైపు సర్వీసు రోడ్డులో వెళ్లే భారీ వాహనాలు ఎన్ఏడీ కూడలిలో ఫ్లైఓవర్ దిగువన చిక్కుకుంటున్నాయి. ఫ్లైఓవర్‌ను నిర్మించాక ఇక్కడ పూర్తి స్థాయిలో హెచ్చరిక బోర్డులు, సర్వీస్ రోడ్డులో హైట్‌గేజ్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల సర్వీస్ రోడ్డులో రాకపోకలు సాగించే భారీ వాహనదారులు తరచూ ఇబ్బందులకు గురయ్యేవారు. బాజీ జంక్షన్‌లో ఇటీవల హైట్‌గేజ్‌ను ఏర్పాటు చేయడంతో భారీ వాహన చోదకులకు కాస్త ఊరట లభించినట్టయింది. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వైపు సర్వీసు రోడ్డులో వచ్చే భారీ వాహనాలు బాజీ జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులోకి మళ్లిస్తుండడం వల్ల ఫ్లైఓవర్‌పైకి నేరుగా చేరుతున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా తగ్గుముఖం పడతాయి.

అధునాతన అగ్నిమాపక శకటం ప్రారంభం

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో అధునాతనమైన ఫైరింజన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ అగ్నిమాపక శకటాన్ని పోర్టులో ప్రారంభించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని యాజమాన్యం పేర్కొంది. 11 వేల నీటి లీటర్ల సామర్థ్యంతో పాటు వెయ్యి లీటర్ల ఫోమ్, డ్రై పౌడర్ సిస్టమ్‌తో అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలను ఈ ఫైరింజన్ కలిగి ఉందని తెలిపింది.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పెదగంట్యాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యను పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజీ అన్నారు. నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలలో మూడు రోజుల పాటు జరగనున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల మానసిక పరిపక్వతను గుర్తించి ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.సుజాత, ఎ.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పడాయి అనే అంశంపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లలను సమగ్ర అభివృద్ధి, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్లలోపు వారికి సమగ్ర అభివృద్ధి సాధన కోసం శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలను శిక్షకులు వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీవీ గీతాలక్ష్మి, మానస, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.



కుంచుమాంబ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించిన దృశ్యం

ఎట్టకేలకు పూర్తయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

ఆటోనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి కుంచమాంబ కాలనీలో డ్రైనేజీలను నిర్మించి వాటిపై రక్షణ పలకల ఏర్పాటును మరచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు రావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కార్పొరేటర్ రాజాన రామారావు పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరయ్యాయి. దీంతో రూ.30 లక్షలతో కల్వర్టు, రూ.కోటీ 90 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన రహదారి పనులను శరవేగంగా గురువారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రాజాన రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఐఏఎస్‌ల బృందానికి నేవీ ఆపరేషన్ల గురించి వివరిస్తున్న దృశ్యం

నేవీని సందర్శించిన ఐఏఎస్ ట్రైనీల బృందం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్ ట్రైనీలు నేవీ పనితీరును తెలుసుకునేందుకు బుధవారం విశాఖలోని తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. వారికి ఇక్కడి అధికారులు తీర ప్రాంత రక్షణ, నౌకాదళం ఆపరేషన్ వ్యవహారాలను వివరించడంతో పాటు పలు యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లను చూపించారు.

ఈఎన్‌సీని సందర్శించిన ఆర్మీ ఉద్యోగులు

గోపాల్‌పూర్‌కు చెందిన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కాలేజీ యువ అధికారులు 29 మంది తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. నౌకాదళం పనితీరు, యుద్ధ నౌకలు, తీర ప్రాంత సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు నౌకలను సందర్శించారు. ఆర్మీ, నేవీ పరస్పర సహకారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



తహసీల్దార్‌కు ఇళ్ల దరఖాస్తులను అందజేస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

పెదగంట్యాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలిస్తామని హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చి నెలలగు గడుస్తున్నా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను గురువారం ఆయన తహశీల్దార్ అమలకు అందజేశారు. అనంతరం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నెల రోజుల్లోగా ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలివ్వకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎ.విమల, కె.అచ్యుతరావు, కె.వనజాక్షి, పి.పోలయ్య, పోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర

అగనంపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మ వారిని దర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. తొలుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తులు మరిడిమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించాక ఆలంయ వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. బాణసంచా కాల్పులతో పాటు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పూజలందుకున్న మరిడిమాంబ

రుణ విమోచన లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ-మర్రిపాలెం బస్టాప్ కూడలిలో గల శ్రీరుణ విమోచన లక్ష్మీగణపతిస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేయడం చేయడంతో పాటు లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకాలు జరిపారు. పలువురు భక్తులు సామూహిక లలితసహస్రనామ పారాయణాన్ని పఠించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడు, తదితరలుఉ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ మారువారం పండగ

వేపగుంట: వేపగుంట పరిసర 14 ప్రాంతాల ప్రజల ఇలవేల్పు ముత్యాలమ్మ మారువారం పండగను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి జల, పాల, పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం శ్రీముత్యమాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలఅగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాడేరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్ రోడ్డు మినుములూరు గ్రామ సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ఎ.సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేట మండలం గొందిరాప గ్రామానికి చెందిన సోమెలి వెంకటరమణ (26) విశాఖలోని షిప్‌యార్డులో అప్రెంటీస్ చేస్తున్నాడు. గురువారం ఆయన స్వగ్రామానికి బైకుపై వస్తుండగా పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న ఓ వ్యాన్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని ఈ నెల 24లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ పరిధిలోని జడ్పీ, మండల పరిషత్, మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎంలు, సాధారణ సీనియారిటీ జాబితా మొదటి జాబితాలో గల అభ్యంతరాలను పరిష్కరించామన్నరు. వీటిని జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, ఆఫీస్ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యంతరాల సమర్పణకు అవసరమైన వివరాల కోసం సదరు ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయురాలి పూర్తి పేరు, ఎక్కడ పని చేస్తున్నది వివరాలు, ఈఎంపీ ఐడీ తెలియజేయాలన్నారు. సీనియారిటి జాబితాలో గల తప్పిదాన్ని స్పష్టంగా పేర్కొనడంతో పాటు సంబంధిత ఆధారాలను తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఆయా అభ్యంతరాలను సంబంధిత కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నాక సంబంధిత ప్రధానోపాధ్యాయుల/ఉపాధ్యాయురాలికి సమాచారం తెలియజేస్తుందని డీఈవో ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆహ్లాద తీరం... ఆదమరిస్తే శోకం!



తీరంలో ప్రమాదకరంగా స్నానాలు చేస్తున్న యువకులు

(బీచ్ రోడ్డు, ఆంధ్రజ్యోతి)

ఎగసిపడే అలలను చూస్తూ... తీరంలో కేరింతలు కొడుతూ సముద్ర స్నానం చేయడం... ఆటలాడడం మధురానుభూతి. ఆ ఆహ్లాదకర వాతావరణంలో ఎంతోసేపు గడిపినా తనివితీరదు. అయితే స్నానానికి దిగి... కేరింతల మధ్య కాస్త లోపలికి వెళ్లిపోతే... ఒక్క ఉదుటన పెద్ద అల వచ్చి మీద పడితే.. క్షణాల్లో జీవితాలు తారుమారైపోతాయి. ఇక మద్యం సేవించి స్నానాలకు దిగడం, తీరంలో ఆటలాడుతూ కెరటాల మధ్యకు వెళ్లిపోవడం లాంటి నిర్లక్ష్యానికి తగిన మూల్యం తప్పదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోంచి రక్షించేందుకు తీరంలో నియమించిన లైఫ్ గార్డులు ఎంతో మందికి ప్రాణభిక్ష పెడుతున్నారు. తగిన సమయంలో స్పందించి మునిగిపోతున్న వారిని సురక్షితంగా తీరానికి చేరుస్తున్నారు.

- సముద్ర స్నానాలతో అప్రమత్తం
- కెరటాల తాకిడికి ఎందరో బలి
- సూచనలు పట్టించుకోకపోవడమే కారణం
- ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న గజ ఈతగాళ్లు
- నగరంలోని 50 మంది మత్స్యకారులకు లైఫ్ గార్డులుగా శిక్షణ

కల్లోల కడలి కెరటాల తాకిడిలో చిక్కుకున్న వారికి మరో జన్మను ప్రసాదిస్తున్నారు లైఫ్ గార్డులు. ఆర్కే బీచ్‌లో కనిపించే ఈ గజ ఈతగాళ్లు అక్కడ స్నానాలకు దిగే సందర్శకులకు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తారు. అయితే సంద్రాన్ని చూడడమే తరువాయి ఉత్సాహాన్ని నిలువరించలేని చాలామంది కెరటాల్లో ముందుకు వెళ్తుంటారు. అలా వెళ్లిన వారిలో కొంత మంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారు. ఇలాంటి విపత్కర పరిస్థితిని గుర్తించి, వారిని క్షేమంగా ఒడ్డుకు చేర్చేందుకు సుమారు 50 మంది లైఫ్ గార్డులు సేవలందిస్తున్నారు.

సాధారణంగా సముద్ర స్నానానికి దిగే సందర్శకులు సరదాగా కొంచెంకొంచెం ముందుకు వెళ్తుంటారు. అప్పుడే ఓ విజిల్ వినిపిస్తుంది. బాబూ.. అటువైపు వెళ్ల వద్దు అని హెచ్చరిక. దీంతో చాలామంది వెనక్కి వస్తారు. అయితే కొంతమంది మాత్రం ఇదంతా మామూలే అనుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. కెరటాల మృత్యు కౌగిలిలోకి చేరే సమయంలో గజ ఈతగాళ్ళు చెప్పిన మాటలు ప్రతిధ్వనిస్తాయి. అయితే అప్పటికే జీవితం చేజారిపోతుంది. ముందుగానే మాట వింటే అందరికీ సంతోషం మిగులుతుంది.



బాధితులను ఒడ్డుకు చేర్చుతున్న లైఫ్‌గార్డులు (ఫైల్ ఫొటో)

తీరంలో లైఫ్ గార్డుల పాత్ర

సముద్రంలో స్నానాలకు దిగి చాలామంది మృత్యువాత పడుతుండడంతో ప్రభుత్వం ఆయా చోట్ల పహారాకు పోలీసులను నియమించింది. అయితే ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీలుగా గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని భావించింది. ఇందులో భాగంగా మత్స్యకార యువకులకు మెలకువలు నేర్పించి, తీరంలో ఉంచాలని అధికారులను ఆదేశించింది. ఈ క్రమం లో సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించే ప్రక్రియలో 50 మందికి మత్స్యశాఖ అధికారులు శిక్షణ అందించారు. వారంతా ఇప్పుడు సేవలందిస్తున్నారు. మూడేళ్లుగా పనిచేస్తున్న వారు కెరటాల్లో చిక్కుకున్న సుమారు 300 మంది సందర్శకుల ప్రాణాలను రక్షించారు.

ఈ జాగ్రత్తలు అవసరం

- సంద్రంలో స్నానానికి దిగే సందర్శకులు పోలీసులు, గజ ఈతగాళ్ల సూచనలను పాటించాలి.
- మద్యం సేవించి సముద్రంలో దిగడం ప్రమాదకరం.
- సురక్షిత తీరంలో సముద్ర స్నానాలు చేయాలి.
- జన సంచారం లేని ప్రాంతం వైపు వెళ్లకూడదు.
- తుఫాన్, సునామీ తదితర హెచ్చరికల సమయాల్లో సముద్రం వైపు వెళ్లరాదు

నిర్లక్ష్యమే కారణం

సముద్ర స్నానాలకు దిగే వారిలో కొంతమంది యువత మద్యం సేవించి, అలల్లో ఆడుతుంటారు. మత్తులో లోపలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో అడుగు తీసి అడుగు వేసేలోగా ఒక్కోచోట సముద్రం పది అడుగుల కంటే ఎక్కువ లోతుంటుంది. అందులో పడిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటారు. మరికొంతమంది పెద్ద అలల తాకిడికి బలవుతుండగా, ఇంకొందరు సుడిగుండాల్లో చిక్కుకుంటారు. తీరంలో మెరైన్ పోలీసులు, గజ ఈత గాళ్ల హెచ్చరికలకు విలువనిస్తే ప్రమాదాలకు ఆస్కారమే ఉండదని గుర్తించాలి.

వాతావరణం అనుకూలంగా లేకుంటే...

యువకులు బీచ్‌లో వాలీబాల్, క్రికెట్ తదితర ఆటలు ఆడుతుంటారు.ఆ సమ యంలో బంతి సముద్రంలోకి వెళుతుంది. దాని వెంట పరుగులు తీస్తూ కెరటాలకు బలవుతుంటారు. ఈ మాదిరిగానే గతంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు జీన్ ప్యాంట్లు, టీ షర్టులతో సముద్రంలోకి దిగితే అవితడిచి బరువు ఎక్కువవుతుంది. దీంతో మునిగిపోయే ప్రమాదముంది. కొందరు ప్రేమికులు ఒకరినొకరు పట్టుకొని ఉత్సాహంగా స్నానం చేస్తూ కెరటాల తీరును అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతుంటారు. కొందరు తీరంలోని రాళ్ల పై నిల్చొని ఫొటోలు తీసుకునే సమయంలో కెరటాల తాకిడికి అదుపు తప్పి, నీళ్లలో పడి ప్రాణాలు కోల్పోతుంటారు.

ముందే హెచ్చరిస్తాం



సముద్ర స్నానాలకు వచ్చే వారికి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తాం. ఎక్కడ లోతు ఉంటుందో, కెరటాల ఉధృతిని అంచనా వేసి అప్రమత్తం చేస్తాం. కొంతమంది మా మాటలను వినిపించుకోకుండా లోపలికి వెళ్లి ప్రమాదాల్లో చిక్కుకుంటారు. ఎవరైనా మునిగిపోతున్నారని తెలిస్తే తక్షణమే వారిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తాం. కొన్ని సందర్భాల్లో కొంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటారు. చిన్న పిల్లలను తీరానికి తీసుకువచ్చే తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా వినాయక చవితి, దసరా ఉత్సవాల అనంతరం విగ్రహాల నిమజ్జనోత్సవంలో మరింత జాగ్రత్తగా విధులు నిర్వహిస్తాం.

- పోలరాజు, లైఫ్ గార్డు

మూడేళ్లుగా సేవలు



తీరంలో మూడేళ్లుగా లైఫ్‌గార్డులు సేవలందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో చాలా లోపలికి వెళ్లిన వారిని కూడా ప్రాణాలతో కాపాడుతున్నారు. ఈ సమయంలో వారి ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా, విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండేలా చూస్తున్నాం. తగిన శిక్షణ అందివ్వడంతో ఇప్పటికే ఎంతో మంది ప్రాణా లు కాపాడారు. ఉత్సవాల సమయం లో రేయింబవళ్లు సేవలందిస్తుంటారు.

- పి.లక్ష్మణరావు, మత్స్యకార సహాయ సంచాలకులు

'ఢిల్లీ' క్రీడాకారుల ప్రాక్టీస్ మ్యాచ్



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ నెల 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆటగాళ్లు ముమ్మర సాధన చేస్తున్నారు. ఈ సీజన్ ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏను హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ క్రీడాకారులు గురువారం సాధనలో భాగంగా ప్రాక్టీస్ మ్యాచ్ ఆడారు. జట్టు కెప్టెన్ అక్షర పటేల్, కేఎల్ రాహుల్ మినహా మిగిలిన జాక్ ఫ్రాసెర్, హర్రీ బ్రోక్, కరుణ్ నాయర్, డుప్లెసిస్, పెర్రీరియా, అభిషేక్ పోరల్, త్రిస్టెన్, అశుతోష్ శర్మ, సమీర్ రజ్వీ, దర్శన్ నల్కాండ్, విపరాజ్ నిగమ్, అజయ్ మండల్, మన్వత్‌కుమార్, త్రిపూర్ణ విజయ్, మహదేవ్ తివారి, ముకేష్ కుమార్, మిశ్చల్ స్టార్క్, నటరాజన్, మోహిత్ శర్మ, దుష్మంత చమీరా వంటి ఆటగాళ్లందరూ ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లతో స్థానిక క్రీడాకారులు కూడా జత కలిసి కొద్దిసేపు ఫ్లడ్ లైట్లలో మ్యాచ్ ఆడారు.

24, 30 తేదీల్లో ట్రాఫిక్ మళ్లింపు

- క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా 11 పార్కింగ్ స్థలాల ఏర్పాటు

మధురవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పీఎం పాలెం ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 24, 30 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ టీ-20 మ్యాచ్‌ల సందర్భంగా ఆ రెండు రోజులు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు. 24న ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జైన్స్, 30న ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. వీటిని ప్రత్యక్షంగా వీక్షించడానికి వచ్చే ఔత్సాహికుల వాహనాలు నిలుపుకొనేందుకు స్టేడియం పరిసరాల్లో 11 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనాలను దారిమళ్లించాలని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి నగరానికి వచ్చే బస్సులు, ఇతర వాహనాలు సోమవారం, 30న శొంఠ్యాం, పెందుర్తి, ఎన్ఏడీ, టీసీపాలెం మీదుగా నగరంలోకి రావాలి. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు టీసీపాలెం, ఎన్ఏడీ, పెందుర్తి, శొంఠ్యాం మీదుగా ప్రయాణించాలి. విజయనగరం, శ్రీకాకుళం నుంచి నగరానికి వచ్చే చిన్న వాహనాలు మారికివలస వద్ద ఎడమ వైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరి కుడివైపు తిరిగి బీచ్‌రోడ్డు మీదుగా రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్ళపాలెం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు చేరుకోవాలి. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు కారుషెడ్ ముందు పెప్సీ వద్ద మలుపు తిరిగి మిథిలాపురి వుడాకాలనీ, ఎంవీవీ సిటీ, లా కాలేజీ మీదుగా పనోరమహిల్స్‌కు చేరుకొని రుషికొండ మీదుగా వెళ్లాలి. నగరం నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక వద్ద ఎడమవైపు తిరిగి బీఆర్‌టీఎస్ రోడ్డులో అడవివరం, నీలకుండీలు జంక్షన్ మీదుగా ఆనందపురం చేరుకోవాలి. నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే చిన్న వాహనాలు హనమంతవాక జంక్షన్ లేదా విశాఖ వేలీ జంక్షన్ మీదుగా మారికివలస ఎన్‌హెచ్-16కు చేరుకోవాలని సూచించారు.

పార్కింగ్ స్థలాలకు ఇలా చేరుకోవాలి..

మ్యాచ్ జరిగే రోజు వీవీఐపీ, వీఐపీ పాస్‌లు కలిగిన వాహనదారులు వీవీఐపీ ఎ గ్రౌండ్ పి-1లో పార్కింగ్ చేయాలి. వీఐపీ వాహనాలు బి గ్రౌండ్‌లో పి-2 వద్ద నిలిపివేయాలి. వి కన్వెన్షన్ పి-3 వద్ద కూడా వీఐపీలు తమ వాహనాలు నిలుపుకోవచ్చు. నగరం నుంచి మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వాహన చోదకులు ఎన్‌హెచ్-16 ఓల్డేజ్ హోం జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ సమీపంలోని పి-4లో పార్కింగ్ చేయాలి. శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చే వాహనచోదకులు కారుషెడ్ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకొని పి-4లో పార్క్ చేయాలి. పత్రికా విలేఖరులు, మీడియా వాహనాలు గేట్ నంబర్ 10, 11కు సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి వద్ద పి-5లో పార్కింగ్ చేయాలి. శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చే ఇతర వాహనాలను పెప్సీ మలుపు వద్ద తిరిగి పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్ పి-6, ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డు పి-7, ద్విచక్రవాహనాలను జీవీఎంసీ పార్క్ పి-8, కళ్యాణ్‌కుమార్ సైట్ పి-9 వద్ద నిలిపివేయాలి. పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారుల వాహనాలను ఎంవీవీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్ ముందు ఉన్న ఖాళీ స్థలంలో పి-10లో పార్కింగ్ చేయాలి. ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికివలస వద్ద ఎడమవైపు తిరిగి తిమ్మాపురం రోడ్డు మీదుగా లా కళాశాల వద్దకు చేరుకొని పి-11లో పార్కింగ్ చేసుకోవాలి. మ్యాచ్ అనంతరం సాంకేతిక కళాశాల్లో పార్కింగ్ చేసిన వాహన యజమానులు విజేత సూపర్ మార్కెట్ మీదుగా కారుషెడ్‌కు వెళ్లి ఎన్‌హెచ్-16కు చేరుకోవాలి. నగరంలోకి వెళ్లేవారు ఓల్డేజ్ హోం జంక్షన్ నుంచి కుడివైపు తిరిగి ఎండాడ మీదుగా నగరంలోకి చేరుకోవాలి.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి



మృతి చెందిన దిలీప్‌కుమార్

గాజువాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగలడంతో ఇంటర్ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి శ్రీనగర్ ప్రాంతానికి చెందిన జి.దిలీప్‌కుమార్ (16) గురువారం మధ్యాహ్నం చినగంట్యాడ నాయుడోరు వీధిలో గల బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యక్రమానికి వచ్చాడు. భోజనం చేశాక దిలీప్‌కుమార్ సరదాగా మేడపైకి వెళ్లాడు. ఆ సమయంలో అటు, ఇటు తిరుగుతుండగా ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో బంధువులు సమీపంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే దిలీప్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దిలీప్ ఇటీవలే ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాశాడు. మృతుడి తండ్రి అప్పలరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మహారాణిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరేసుకుని మృతిచెందాడు. టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన అల్లాడ నరసింహమూర్తి (39) తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉండేవాడు. గతంలో హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి అనంతరం విశాఖకు వచ్చి ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనితో గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబికులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ మార్గంలో అదుపు తప్పిన కారు

- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన జి.రాహుల్ అనే యువకుడు కారులో కూర్మన్నపాలెం నుంచి స్టీల్ ప్లాంట్ మార్గంలో వెళ్తుండగా కణితి జంక్షన్ వద్ద అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న టౌన్‌షిప్ సెక్టార్-6 ప్రాంతానికి చెందిన కె.కోటేశ్వరరావు (61)ను ఢీకొన్నాడు. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొని మళ్లీ రోడ్డుపై బోల్తా పడింది. ఈ క్రమంలో అదే మార్గంలో మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న పెదగంట్యాడ సమీపంలోని వెంపళ్లనగర్‌కు చెందిన ఇందల అప్పారావు (51)ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులిద్దరికీ గాయాలయ్యాయి. ప్రస్తుతం వారిద్దరూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

ముడసర్లోవ పార్కులో భారీ అగ్ని ప్రమాదం



ముడసర్లోవ పార్కులో దగ్ధమైన ప్రాంతం



పార్కులో ఎగసిపడుతున్న మంటలు

- వెదురు తుప్పల్లో నుంచి ఎగసిన మంటలు
- రూ.3 లక్షల ఆస్తి నష్టం
- ఆకతాయిల పనేనని అనుమానం?

ఆరిలోవ, మార్చి20(ఆంధ్రజ్యోతి) ముడసర్లోవ పార్కులో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నాలుగు సింథటిక్ టాంకర్లతో పాటు నాలుగు హెచ్‌డీసీ పైపులు, ఇతర పరికరాలు దగ్ధమైనట్టు వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.3. లక్షలు ఉంటుందని చెప్పారు.

పార్కులోని గెస్ట్‌హౌస్ సమీపంలో గల వెదురు పొదల వద్ద గవెండు తుప్పల నుంచి గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికంగా ఉన్న వర్కర్లు కొంతవరకు మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో గాలి కూడా వీయడంతో మంటలు మరింతగా వ్యాపించాయి. అనంతరం అగ్ని మాపక శకటం సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఇది ఆకతాయిల పని అయి ఉంటుందని అంటున్నారు. లేదా పార్కునకు వచ్చిన వారు సిగరెట్ వంటివి తాగి ఆ నిప్పును తుప్పల్లో పడేయడంతో మంటలు చెలరేగి ఉండవచ్చని అంటున్నారు. మంటలు భారీ వ్యాపించడంతో పార్కులో పచ్చదనానికి కొంత నష్టం వాటిల్లింది.

పేరు మార్చకపోయినా వైసీపీ ఉలికిపాటు



క్రికెట్ స్టేడియం వద్ద విలేఖర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పాల్గొన్న వైసీపీ నాయకులు

- క్రికెట్ స్టేడియానికి వైఎస్ఆర్ పేరు తొలగిస్తున్నారంటూ ఆరోపణలు
- వైసీపీ నిరసన నవ్వులపాలు

కొమ్మాది, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అంతర్జాతీయ స్టేడియానికి ఉన్న వై.ఎస్.ఆర్ పేరును తొలగించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను సహించేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం పి.ఎం.పాలెం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద ఆ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. మహానేత వై.ఎస్.ఆర్ ఆనవాళ్లను తుడిచివేయాలన్న ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచనలను సాగనివ్వబోమని అమర్‌నాథ్ అన్నారు. క్రికెట్ స్టేడియంకు 2009లో వై.ఎస్.ఆర్ పేరు పెడుతూ ఆంధ్ర క్రికెట్ సంఘం గవర్నింగ్ బాడీ నిర్ణయం తీసుకుందని అన్నారు. క్రికెట్ స్టేడియం వద్ద నిరసనకు పిలుపు ఇవ్వడంతో వైసీపీ నేతలను, కార్యకర్తలను పోలీసులు గృహనిర్బంధం చేయటం అన్యాయమని అన్నారు. అయితే నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో క్రికెట్ స్టేడియం ప్రధాన ద్వారానికి రెండువైపులా పెద్ద పెద్ద అక్షరాలతో వై.ఎస్.ఆర్ క్రికెట్ స్టేడియం అని, ప్రధాన ద్వారానికి కుడి వైపు వై.ఎస్.ఆర్ నిలువెత్తు విగ్రహం ఉండటం చూసి వైసీపీ ఉలికిపాటుకు పలువురు నవ్వుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డులు కూడా వైసీపీ రంగులను పోలి ఉన్నా, ఆ పార్టీ నాయకులు ఎందుకింత రచ్చచేస్తున్నారని స్థానికులు, క్రికెట్ మ్యాచ్ ఏర్పాట్లను పరిశీలించటానికి వచ్చిన పలువురు గుసగుసలాడుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.